Follow: @ANNTELUGU

ANN తెలుగు

24-02-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 84 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## భారత్ చేతిలో పాక్ చిత్తు

### విరాట్ వీరవిహారం

ఛాంపియన్స్ ట్రోఫీలో రెండో విజయం

వన్డేల్లో కోహ్లీ ఆల్‌టైమ్ రికార్డ్

సెమీస్ కు భారత్.. టోర్నీ నుండి పాక్ ఔట్

**మహా:** ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది. ప్రస్తుత ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు ఇది రెండో విజయం కాగా, పాకిస్థాన్‌కు రెండో ఓటమి. భారత్ తాజాగా విజయంతో 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో పాక్‌పై ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. కోహ్లీకిది వన్డేల్లో 51వ సెంచరీ కావడం విశేషం. అదే సమయంలో వన్డేల్లో వేగంగా 14 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు. తాజా విజయంతో భారత్ సెమీస్ అవకాశాలు మరింత మెరుగవ్వగా, పాక్ దాదాపుగా టోర్నీ నుంచి నిష్క్రమించింది.

వివరాలు 8లో

టాప్ న్యూస్

## సీఎం గారు... మీలో పౌరుషం చచ్చిపోయిందా?


- కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



03

## వలస దారులపై ట్రంప్ తీరు ఆక్షేపణీయం


- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- అమెరికా పార్లమెంట్ ముందు నుంచి వీడియో విడుదల



02

## మహాకుంభమేళా ఐక్యతకు గుర్తు

- భవిష్యత్ తరాలకు స్ఫూర్తి
- ఆశ్చర్యపరిచిన ఆధ్యాత్మిక వేడుక: ప్రధాని మోదీ
- ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా ప్రధాని ఎదురుదాడి



02



ఢిల్లీ విపక్ష నేతగా

## అతిషీ

ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఆప్ శాసనసభా పక్షం

పాల్గొన్న 22 మంది ఆప్ ఎమ్మెల్యేలు

వివరాలు 2లో



లీజుకు పర్యాటక

## ఆస్తులు

35 ఆస్తులను గుర్తించిన అధికారులు

ఆదాయ పెంపుపై ప్రత్యేక దృష్టి

వివరాలు 2లో




నెక్లెస్ రోడ్‌లోని

## నీరా కేఫ్‌ను మూసివేయం

నీరా ఆరోగ్యానికి మంచిది

స్పష్టం చేసిన ఎక్సైజ్ శాఖ

వివరాలు 2లో



ఈసారి

## తీన్మార్ ఖాయం

కాంగ్రెస్ పార్టీని ఎవ్వరూ నమ్మడం లేదు

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

వివరాలు 2లో

# రంగంలోకి రేవంత్



## నేడు మూడు జిల్లాల్లో సీఎం టూర్

### పట్టభద్ర ఫైట్‌కు ఫైనల్ టచ్

రేవంత్ పర్యటనతో వార్ వన్ సైడ్ అవుతుందంటున్న కాంగ్రెస్..

సిట్టింగ్ సీటును ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న నేతలు

జూమ్ మీటింగ్‌లు.. నియోజకవర్గాల వారీ సమావేశాలతో నిరంతర పర్యవేక్షణ

ప్రతీరోజూ పర్యవేక్షిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్..

మంత్రులు, ఎమ్మెల్యేలతో సమన్వయం

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టభద్ర ఫైట్ కు ఫైనల్ టచ్ ఇవ్వబోతున్నారు. సోమవారం ఒకేరోజు మూడు జిల్లాల్లో సీఎం పర్యటించి పట్టభద్రుల ఆత్మీయ సమావేశాల్లో పాల్గొంటారు. పట్టభద్ర ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతున్న నేపథ్యంలో సిట్టింగ్ సీటును నిలుపుకోవడం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ సర్వశక్తులు ఒడ్డుతోంది. కాంగ్రెస్ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో మోహరించడంతో పాటు నియోజకవర్గాల వారీగా ఇన్ ఛార్జిలను నియమించి, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తోంది. ఇప్పటికే రెండుసార్లు జూమ్ మీటింగ్ లు నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ ప్రచారం తీరును, గ్రౌండ్ రిపోర్ట్ ను ఎప్పటికపుడు తెలుసుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ , ఉమ్మడి నిజామాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీకి పరిస్థితి పూర్తి అనుకూలంగా ఉందని భావిస్తున్న నేతలు పట్టు సడలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మిగతా 2లో




# సొరంగంలోనే ప్రాణాలు

## ప్రమాద స్థలంలో పరిస్థితి తీవ్రం

ఎనిమిది మందిని కాపాడడం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్న సర్కార్

స్వయంగా సొరంగంలోకి వెళ్ళి మంత్రి జూపల్లి సాహసప్రయత్నం

టన్నెల్‌లోనే దాదాపు ఐదు గంటలు పాటు జూపల్లి కృష్ణారావు

ముఖ్యమంత్రి రేవంత్ కు రాహుల్ గాంధీ ఫోన్..

చిక్కుకున్న వారి ప్రాణాలను కాపాడేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేయాలని సూచన.. టన్నెల్ వద్దే మంత్రులు ఉత్తమ్, జూపల్లి

పరిస్థితిని ఎప్పటికపుడు తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సమస్య అంతా వందమీటర్లలోపే.. బురద అధికంగా ఉండడం వల్లే సమస్య

ఘటన తీవ్రత చాలా ఎక్కువగా ఉంది మంత్రి జూపల్లి

## రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ ఫోన్

- ఎస్ఎల్ బీసీ ప్రమాద ఘటనపై ఆరా
- సహాయక చర్యల తీరుపై అభినందించిన రాహుల్
- దాదాపు 20 నిమిషాలు మాట్లాడిన అగ్రనేత



02

## 40 నిమిషాల్లోనే

### ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీకి..

- సర్వే పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఎన్వీఎస్ రెడ్డి
- కాలుష్య రహిత గ్రీన్ సిటీగా ఫ్యూచర్ సిటీ కానుంది



02

తెలంగాణలో కొత్త లిక్కర్ బ్రాండ్లకు

## ఆహ్వానం

రాష్ట్రంలో లేని విదేశీ, దేశీయ లిక్కర్, బీర్ కంపెనీలకు అవకాశం



వివరాలు 7లో

## యాదగిరిగుట్ట స్వర్ణ విమాన గోపురం

# ఆవిష్కరించిన సీఎం రేవంత్

- గోపురం మహా సంప్రోక్షణకు 40 జీవనదుల జలాల వినియోగం
- దేశంలోనే అతి పెద్ద స్వర్ణ గోపురంగా రికార్డు
- ఇక నుంచి భక్తులకు కనువిందు చేయనున్న స్వర్ణమయ గోపురం

02



# యూరియా కొరత లేదు

## రైతులు ఆందోళన పడవద్దు

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి

ఈ వారంలో 81,800 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా

**మహా:** రాష్ట్రంలో యూరియా కొరతలేదని, రైతుల ఆందోళనకు గురికావద్దని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. వ్యవసాయాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, ఈ వారంలో రాష్ట్రానికి మరో 81,800 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని తెలిపారు. గత యాసంగిలో రైతులు ఫిబ్రవరి 20 నాటికి 6.9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొనుగోలు చేయగా, ఈ సారి 8.80 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారని, గత సంవత్సరం ఫిబ్రవరిలో 1.99 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే, ఈ సంవత్సరం ఫిబ్రవరి 20 నాటికి 2.59 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వము నుండి 8.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సిఉండగా, రాష్ట్రానికి 6.81 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని, కేంద్రంతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ, ఎప్పటికప్పుడు పరిస్థితులు వివరిస్తున్నా,



మిగతా 2లో

# రంగంలోకి రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

ఒక్క కరీంనగర్ లోనే దాదాపు సగం ఓట్లు ఉండగా, కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం.. పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి సొంత యంత్రాంగం గ్రౌండ్ లో వర్క్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం 11 గంటలకు నిజామాబాద్, మధ్యాహ్నం 1.3o గంటకు మంచిర్యాల, సాయంత్రం 3.30 గంటలకు కరీంనగర్ లలో జరిగే సభల్లో పాల్గొంటారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లాల మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజ నర్సింహ, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండ సురేఖ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్ ఛార్జిలు పాల్గొంటారు. ఓ వైపు పార్టీ ఏఐసిసి ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా రెండు జూమ్ మీటింగ్ లలో పాల్గొనడంతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుసుకుంటున్నారు. పిసిసి చీఫ్ గా ఎన్నికైన తర్వాత మహేష్ కుమార్ గౌడ్ కు తొలి ఛాలెంజ్ కావడంతో ఆయన నిర్విరామంగా పనిచేస్తున్నారు.

**అందరికంటే ముందుగా..**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కి పోటీ చేయాలనీ గత ఆరు నెలల నుండి నరేందర్ రెడ్డి ప్రణాళిక ప్రకారం పనిచేసుకున్నారు. అందుకు తగ్గట్టే ఓటర్ ఎన్ రోల్ మెంట్ కూడా ఉమ్మడి నాలుగు జిల్లా లో గ్రాడ్యుయేట్ లకు అవగాహన కల్పించి చేయించారు. తన కాలేజీ లో పనిచేసే సిబ్బంది ని పూర్తిగా ఉపయోగించుకున్నారు. ప్రతి నియోజకవర్గం కు ఒక ఇన్ ఛార్జిని పెట్టుకుని నెల నెల వేలల్లో జీతాలు ఇచ్చి పూర్తి స్థాయిలో పని తీసుకున్నారు. టికెట్ ప్రకటించేవరకు జాగ్రత్తగా పనిచేసిన నరేందర్ రెడ్డి తర్వాత నేతలను సమన్వయం చేసుకోవడంలో తడబడడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. దుష్ప్రచారం భారీగా చేశారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్, పిసిసి చీఫ్, మంత్రులు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగిన తర్వాత గ్రౌండ్ మారుతూ వస్తోందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. బిజెపి మూడుస్థానాల్లో పోటీచేస్తున్నా ఆ పార్టీకి అన్ని స్థాయిల్లో నాయకుల సహకారం అందడం లేదు. కరీంనగర్ తో పాటు నిజామాబాద్ జిల్లాల్లోనూ నేతలు అలకబూనారు. వీరిని సమన్వయం చేస్తూ ప్రచారవేడి కొనసాగించడం సవాల్ గా మారింది. ఇతర అభ్యర్థుల ప్రభావం ఏ మేరకు ఉంటుందన్నది కూడా గెలుపు ఓటములను ప్రభావితం చేయనుంది.

## హోరాహోరీ

ఎన్నిక ఏదైనా ప్రచారం జరిగేటపుడు హోరాహోరీగానే కనిపిస్తోంది. తొలిసారి బిజెపి పట్టభద్ర గ్రౌండ్ లో గట్టిగా పోరాడుతోంది. బిజెపి అభ్యర్థిగా సంగారెడ్డికి చెందిన అంజిరెడ్డిని ప్రకటించగా, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్ ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని మంత్రులు, ఎమ్మెల్యేలను మోహరించింది. రెండు పార్టీలు కూడా పోలింగ్ బూత్ ల వారీగా ఓటర్ల జాబితాలను తీసుకొని 25 లేక 50 మంది ఓటర్లకు ఒక ఇన్చార్జీ, ఇద్దరు సహాయకులను నియమించి వారిని కలిసి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించాయి. ఓటర్లందరి ఫోన్‌నెంబర్లను కూడా సేకరించిన పార్టీలు మెస్సెజీలు, వాట్సాప్ సందేశాల ద్వారా, వీడియోల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నాయి. వారందరికీ ఆన్‌లైన్‌లో డబ్బు పంపించే ఏర్పాట్లు కూడా కొందరు చేస్తున్నారు. గ్రామకమిటీల ద్వారా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తమ అభ్యర్థులను గెలిపించు కోవడం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. బిఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరిక్రిష్ణ కూడా పోటీ ఇస్తున్నారు. పట్టభద్ర రాజకీయం రసవత్తరంగా మారగా, సీఎం ఎంట్రీతో గేమ్ ఛేంజ్ అవుతుందని భావిస్తున్నారు. చివరి రెండు రోజుల్లో పోటీ ఏకపక్షమయ్యే అవకాశాలున్నాయన్న అంచనాల్లో అధికారపార్టీ ఉంది. మరోవైపు బిఆర్ఎస్ ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండగా.. బిజెపికి మద్దతుగానే సైడయిపోయిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

# యాదగిరిగుట్ట స్వర్ణ విమాన గోపురం ఆవిష్కరించిన సీఎం రేవంత్

- గోపురం మహా సంప్రోక్షణకు 40 జీవనదుల జలాల వినియోగం
- దేశంలోనే అతి పెద్ద స్వర్ణ గోపురంగా రికార్డు
- ఇక నుంచి భక్తులకు కనువిందు చేయనున్న స్వర్ణమయ గోపురం



**మహా :** తెలంగాణలో అతిపెద్ద ఆలయంగా ప్రసిద్ధి చెందిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వర్ణ విమాన గోపురాన్ని సీఎం రేవంత్ రెడ్డి దంపతులు ఆదివారం ఆవిష్కరించారు. వానమామలై మఠం 31వ పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో మహాకుంభాభిషేక సంప్రోక్షణల మధ్య ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పంచకుండాత్మక నృసింహ మహాయాగం నిర్వహించి స్వర్ణ విమాన గోపుర ప్రతిష్టాపన మహోత్సవాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. గోపురం మహాసంప్రోక్షణకు 40 జీవనదుల జలాలతో అభిషేకించి సంప్రోక్షణ చేశారు. అనంతరం స్వర్ణ విమాన గోపుర ఆవిష్కరణ క్రతువును వైదిక బృందం వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించింది. అనంతరం గర్భగుడిలో సీఎం రేవంత్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వాదం ఇచ్చారు. అద్భుత కృష్ణ శిల్పకళా వైభవంతో నిర్మితమైన యాదగిరిగుట్ట ఆలయం నేటి నుంచి స్వర్ణమయ శోభితమైన భక్తులను కనువిందు చేయనుంది.

**గోపురం విశేషాలివే..**

- యాదగురిగుట్ట స్వర్ణ విమాన గోపురం ఎత్తు మొత్తం 50.5 అడుగులు కాగా గోపురం వైశాల్యం 10,759 చదరపు అడుగులు. తిరుమల గోపురం 33 అడుగులు కాగా దేశంలోనే యాదగిరి గుట్ట స్వర్ణగోపురం అతి పెద్దది.
- గోపురానికి స్వర్ణతాపడానికి మొత్తంగా 68 కిలోల బంగారాన్ని ఉపయోగించారు. గతేడాది డిసెంబరు 1న పనులు ప్రారంభం కాగా ఈ ఏడాది ఫిబ్రవరి 18 తాపడం కవచాల బిగింపు పనుల పూర్తయ్యాయి. బిగింపు పనులకు అయిన మొత్తం ఖర్చు రూ.5.10 కోట్లు కాగా మొత్తంగా రూ.80 కోట్ల వరకు ఖర్చు చేశారు
- తమిళనాడు మహాబలిపురానికి చెందిన స్థపతి రవీంద్రన్ ఆధ్వర్యంలో నానో టెక్నాలజీతో తాపడం పనులు చేపట్టారు. 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారంతో తాపడం పనులు చేపట్టారు. 50 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా ఈ పనులు పూర్తి చేశారు.
- మహాబలిపురంలో రాగి తొడుగులను తయారు చేసి వాటిని చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీ ద్వారా స్వర్ణ కవచాలగా మార్చి గోపురానికి తాపడం చేశారు.
- గంగా, యమున, కృష్ణ, గోదావరి, తుంగభద్ర, నర్మదతో కలిపి మొత్తం 40 జీవ నదుల జలాలతో స్వర్ణ విమానానికి మహాసంప్రోక్షణ చేశారు.
- స్వర్ణ విమాన గోపురంపై ఉన్న నృసింహ అవతారాలు, విష్ణుమూర్తి, లక్ష్మీ(ఆండాళ్ అమ్మవారు), గరుడమూర్తులు భక్తులకు స్వర్ణమయంగా కనువిందు చేయనున్నాయి.
- స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 1నుంచి ప్రారంభమై కానుండగా మార్చి 23వరకు కొనసాగుతాయి. 8న స్వామి అమ్మవార్ల కల్యాణోత్సం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలలో స్వామివారికి అలంకార, వాహన సేవలు ఘనంగా నిర్వహిస్తారు.

# ఈసారి తీన్మార్ ఖాయం

### కాంగ్రెస్ పార్టీని ఎవ్వరూ నమ్మడం లేదు.. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**మహా :** పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీని ఎవ్వరూ నమ్మడం లేదని చెప్పారు. ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీకి వచ్చేది మాత్రం గాడిద గుడ్డేనని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కిషన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సోనియా గాంధీ సంతకంతో ఆరు గ్యారంటీలంటూ ఇంటింటి ప్రచారం చేసి ఓట్లు వేయించుకొని ప్రజల్ని ఆ పార్టీ నేతలు మోసం చేశారని ఆరోపించారు. ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని చెప్పారు. గత రెండు ప్రభుత్వాలు రూ. 9 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని విమర్శించారు. తెలంగాణలో కూడా డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఒకసారి గెలిచిన రాష్ట్రంలో మళ్లీ ఆ పార్టీ గెలవడం లేదని ఎద్దేవా చేశారు. నిజమైన మార్పు తెలంగాణలో రాలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం ఎప్పుడు ఉండిపోతుందా అన్న పరిస్థితి ఉందని, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, రైతు కూలీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఎన్నికల ముందు అన్ని వర్గాల వారికి ఏదో ఒక హామీ ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా మోసం చేస్తోందన్నారు. 100 రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీలు 400 రోజులు అవుతున్న అతీగతీ లేదని, గ్యారంటీల అమలులో ప్రభుత్వం దగ్గర కనీసం ఎలాంటి కార్యాచరణ లేదన్నారు. హామీలతో అర చేతిలో వైకుంఠం చూపిస్తుంది తప్ప.. అమలు విషయంలో ఎలాంటి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. మహిళలకు నెలకు ఇస్తానన్న రెండున్నర వేలు ఎప్పుడిస్తారో తెలియడంలేదని, ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.35 వేలు బాకీ పడిందన్నారు. కల్యాణ లక్ష్మీ పథకంలో భాగంగా ఇప్పటి వరకు ఒక్క జంట కు కూడా తులం బంగారం ఇవ్వలేదని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రైతు భరోసా కింద రైతుకు, రైతు కూలీకి ఏటా రూ.15 వేలు ఇస్తామని చెప్పారంటూ 50 లక్షల మంది రైతులు, 20 లక్షల మంది కౌలు రైతులకు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు.

ఆయుష్మాన్ భారత్ దేశం మొత్తం విజయవంతంగా అమలు అవుతుంటే తెలంగాణలో మాత్రం కేసీఆర్ పుణ్యమా అని అమలు కాలేదని, కాంగ్రెస్ వచ్చాక కూడా పూర్తిగా అమలు చేయకుండా రోగులను ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. గ్రామ సర్పంచులు, వార్డు మెంబర్లకు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు వాటి ఊసే ఎత్తట్లేదని, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్ అయిన వారికి 5 డీఏలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. 4 వేల నిరుద్యోగ భృతి ఊసు లేదు, బెల్ట్ షాపుల నిర్మూలనపై ఎలాంటి చర్యలు లేవు, బీసీ సబ్ ప్లాన్, మైనారిటీ షబ్ ప్లాన్ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉందన్నారు, బీడీ కార్మికులకు ఈఎస్ఐ పరిధిలోకి తెస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పటికిప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినా ఆ పార్టీకి గాడిద గుడ్డు సున్నా సీట్లు వస్తాయి. దేశవ్యాప్తంగా కాంగ్రెస వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు గ్రాడ్యుయేట్, టీచర్ ఎన్నికలు మార్కుగా విద్యావంతులు, టీచర్లు బీజేపీకి ఓటేసి గెలిపించాలని కోరారు.

## వలస దారులపై ట్రంప్ తీరు ఆక్షేపణీయం

### సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**అమెరికా పార్లమెంట్ ముందు నుంచి వీడియో విడుదల**



**మహా :** అక్రమ వలసదారుల పేరుతో యువతను అమెరికా ప్రభుత్వం క్రూరమైన పద్ధతుల్లో జంతువులను, నేరస్తులను వేటాడుతున్న తీరుగా ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రభుత్వం వలస దారులను తిప్పి పంపే పేరుతో చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఈ మేరకు అమెరికా పార్లమెంటు ముందు నుంచి ఆదివారం ఉదయం ఒక వీడియో విడుదల చేశారు. ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కక్షగట్టినట్టు వలస దారులను జంతువుల తరహాలో వేటాడడాన్ని ఆక్షేపించారు. అక్రమ వలస దారులను తిప్పి పంపడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, భారత ప్రభుత్వం కూడా అమెరికాలో ఉన్న భారతీయ వలస దారులను వెనక్కు తీసుకుంటామని ప్రకటన చేసిందని గుర్తు చేశారు. అయితే ట్రంప్ ప్రభుత్వము వలస దారులని తిప్పి పంపడానికి ఎన్నుకున్న విధానాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. భారత ప్రధాని మోదీ అమెరికాకు వచ్చి ట్రంప్ తో చర్చలు జరిపిన మరుసటి రోజు నుంచి కూడా అదే రీతిలో జంతువులను వేటాడినట్టు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆమెరికలో ఉన్న వలస దారులు ఉన్నట్టుండి వచ్చిన వారు కాదని పేర్కొన్నారు. దశాబ్దకాలంగా అక్కడ ఉంటున్నారని తెలిపారు. వారిని వారి దేశాలకు పంపడానికి చేస్తున్న చర్యలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. అమెరికా ప్రభుత్వ తీరు యువత జీవితం డిస్టర్బ్ అవుతున్నదని పేర్కొన్నారు. వలస దారులను గుర్తించడం వారికి కొంత సమయం ఇచ్చి సుహృద్భావ వాతావరణంలో తిప్పి పంపే ఏర్పాటు చేసి ఉండాల్సిందని నారాయణ అభిప్రాయపడ్డారు. అలా కాకుండా యువతను వేధించి వెంటాడుతున్న తీరును ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

# యూరియా కొరత లేదు

(మొదటిపేజీ తరువాయి)



రాష్ట్రానికి కేటాయించిన దానిలో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా పంపినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే మార్క్ ఫెడ్ వద్ద ఉంచిన 3.08 లక్షల మెట్రిక్ టన్నులతో అవసరం మేరకు అన్ని జిల్లాలకు సరఫరా చేస్తూ ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే మా అధికారులు కేంద్ర అధికారులను కలవడం జరిగిందని, తాను ప్రత్యక్షంగా సంబంధిత మంత్రివర్యులకు లేఖల ద్వారా మా రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను వెంటనే సరఫరా చేయాల్సిందిగా కోరడం జరిగిందని తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన బిజెపి పెద్దలు కూడా ఈ విషయంలో విమర్శలు మాని మన రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను వెంటనే సరఫరా చేసేలా తమ వంతు కృషి చేస్తే బాగుంటుందని, పెరిగిన విస్తీర్ణం మరియు వినియోగం దృష్ట్యా రైతుల శ్రేయస్సును దృష్టిలో వుంచుకొని తమ వంతు బాధ్యత తీస్కొని, రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు మద్ధతు అందిస్తే మంచిదని హితవు పలికారు.. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రాష్ట్రానికి కేటాయించిన యూరియా వెంటనే సరఫరా చెయ్యాలని కోరడం జరిగిందన్నారు. గత యాసంగిలో సాగైన పంటల విస్తీర్ణంతో పోల్చుకుంటే, ఈ సారి నీటి వనరులు, భూగర్భ జలాలు పుష్కలంగా ఉండటం తో ముఖ్యంగా వరి, మొక్కజొన్న పంటల విస్తీర్ణంలో 5 నుండి 10 శాతం వరకు వృద్ధి నమోదైనట్టు, యూరియా వాడకం కూడా గతంతో పోల్చుకుంటే ఇప్పటికే 1.9 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా వినియోగించినట్టు మంత్రిగారు తెలిపారు. ఐనప్పటికి రాష్ట్ర ప్రభుత్వము పంటకాలం ప్రారంభం నుండే నిత్యం సమీక్షించుకుంటూ, రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు సరిపడ యూరియా నిల్వలను అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకున్నామని, వెస్సెల్స్ కానీ, రైల్వే wagons కానీ రావడంలో ఎక్కడైనా, ఏదైనా జిల్లాకు ఆలస్యమైతే వెంటనే పొరుగుజిల్లాల నుండి తరలిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.29 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, ఫిబ్రవరి 22న 3 ర్యాక్స్ 23న 7 , 24న 4 , 25న 7 , 26న 4 , 27న 5 ర్యాక్స్ , 28న 4 ర్యాక్స్ మొత్తం 81,800 మెట్రిక్ టన్నులు ఈ వారంలో సరఫరా అవుతుందని తెలియజేశారు. అధికారులు యూరియా సరఫరా విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, కృత్రిమంగా ఎవరైనా కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తీసుకోవల్సింది గా అధికారులను మంత్రి ఆదేశించారు,

# మహాకుంభమేళా ఐక్యతకు గుర్తు

### భవిష్యత్ తరాలకు స్ఫూర్తి

**ఆశ్చర్యపరిచిన ఆధ్యాత్మిక వేడుక: ప్రధాని మోదీ.. ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా ప్రధాని ఎదురుదాడి**



**మహా:** మహాకుంభమేళా ఐక్యతకు గుర్తుగా భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇప్పటికే కోట్లాది మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసి సంత్‌ల ఆశీస్సులు తీసుకున్నారని చెప్పారు. ఈ ఆధ్యాత్మిక వేడుకను చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోతారని ప్రధాని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఛత్తార్పూర్‌లో బాగేశ్వర్ ధామ్ మెడికల్ సైన్స్ రీసెర్చ్ సెంటర్‌కు భూమి పూజ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా ప్రధాని మోదీ ఎదురుదాడి చేశారు. బానిస మనస్తత్వం కలిగిన కొందరు ప్రజల విశ్వాసాలు, నమ్మకాలతో పాటు ఆలయాలపై దాడులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏ ధర్మం, సంస్కృతి అయితే సహజసిద్ధంగా ప్రగతిశీలంగా ఉందో దానిపై వారు బురదజల్లేందుకు సాహసం చేస్తారంటూ విమర్శించారు.

## రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ ఫోన్

### ఎస్ఎల్ బీసీ ప్రమాద ఘటనపై ఆరా

**సహాయక చర్యల తీరుపై అభినందించిన రాహుల్**

**దాదాపు 20 నిమిషాలు మాట్లాడిన అగ్రనేత**



**మహా :** ఎస్ఎల్ బీసీ సొరంగ మార్గంలో జరిగిన ప్రమాదం, కతార్మికుల గల్లంతు, చేపడుతున్న సహాయక చర్యలు తదితర అంశాలపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదివారం సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడారు. సీఎం రేవంత్ కు ఫోన్ చేసిన రాహుల్ గాంధీ దాదాపు 20 నిమిషాల పాటు మాట్లాడారు. ఎస్ఎల్ బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం జరిగిన వెంటనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లారని రాహుల్ కు సీఎం రేవంత్ తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ టీంలు వెళ్లాయని చెప్పారు. క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. ఘటన తర్వాత ప్రభుత్వం స్పంధించిన తీరుపై రాహుల్ అభినందించారు. సొరంగంలో చిక్కుకున్నవారిని సురక్షితంగా బయటకు తీసేందుకు అన్ని చర్యలూ చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డికి రాహుల్ సూచించారు. ఇది ఇలావుండగా, ప్రధాని నరేంద్ర మోడీ శనివారం సీఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి ఎస్ఎల్బీసీ ప్రమాద ఘటనపై ఆరా తీసిన విషయం తెలిసిందే. ఘటనపై పూర్తి వివరాలను ప్రధానికి తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి. ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న 8 మందిని కాపాడేందుకు సహాయక చర్యలు ప్రారంభించినట్లు ప్రధానికి తెలిపారు. ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో చిక్కుకున్నవారిని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వానికి అన్ని విధాలా సహాయం చేస్తామని ప్రధాని నరేంద్ర మోడీ ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి హామీ ఇచ్చారు. సహాయక చర్యలను మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని ప్రధానికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

# 40 నిమిషాల్లోనే ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీకి...

### సర్వే పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఎన్వీఎస్ రెడ్డి.. కాలుష్య రహిత గ్రీన్ సిటీగా ఫ్యూచర్ సిటీ కానుంది



**మహా :** హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణకు సంబంధించి సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్‌కి సంబంధించిన సర్వే పనులను ఆదివారం సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్ సర్వే శరవేగంగా సాగుతుందన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మార్గం దాదాపు 40 కిలోమీటర్లు ఉంటుందని, ఈ మార్గంలో మెట్రో రైలు వెళితే కేవలం 40 నిమిషాల్లోనే గమ్యాన్ని చేరుకోవచ్చన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌ల తర్వాత నాలుగో సిటీగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికత దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత గ్రీన్ సిటీగా ప్రపంచంలోనే అద్భుత నగరాల సరసన చేరాలన్నది సీఎం రేవంత్ రెడ్డి సంకల్పమని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ సంస్థ హెచ్ఎండీఏ, టీజీఐఐసీలతో కలిసి మెట్రో రైల్ విస్తరణ ప్రణాళిక సిద్ధం చేస్తామని ఆయన వివరించారు. దాదాపు 15 వేల ఎకరాల్లో విస్తరించనున్న ఫ్యూచర్ సిటీని కాలుష్య రహిత నగరంగా రూపొందించడంతోపాటు అంతర్జాతీయ స్థాయి ప్రయాణ సౌకర్యాలు కల్పించడంలో మెట్రో రైలుతో కూడిన ఈ గ్రీన్ కారిడార్ కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. కాగా, ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. అత్యధునిక సౌకర్యాలతో ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దనున్నట్లు ఆయన ఇప్పటికే ప్రకటించారు.

# సొరంగంలోనే ప్రాణాలు

**హైదరాబాద్, నాగర్ కర్నూల్, మహా :** ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారి పరిస్థితి ఆశాజనకంగా లేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎనిమిది కుటుంబాల్లో గత రెండురోజులుగా తీవ్ర మైన ఆందోళన నెలకొనగా, రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం కనిపించలేదు. పరిస్థితిని స్వయంగా అంచనా వేసేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు నేరుగా టన్నెల్‌లోకి వెళ్ళి దాదాపు 5 గంటల పాటు సహాయక చర్యలను పర్యవేక్షించారు. లోపల నీరు. బురద అధికంగా ఉండడతో సహాయచర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో రాష్ట్ర చరిత్రలో పెనువిషాద సంఘటనగా ఇది నమోదయ్యే అవకాశం కనబడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయచర్యలను ఎప్పటికపుడు పర్యవేక్షిస్తుండగా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సీఎం రేవంత్ రెడ్డికి స్వయంగా ఫోన్ చేసి ప్రమాదంపై ఆరా తీశారు. ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకోవాలని సూచించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదలశాఖ అధికారులు, ఆర్మీ, డిఆర్ఎఫ్ టీమ్స్ టన్నెల్ వద్దే మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎస్ ఎల్ బీసీ ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సహాయక చర్యలను దగ్గరుండీ పర్యవేక్షిస్తున్న మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి పలుమార్లు మాట్లాడారు. ఇండియన్ ఆర్మీతో పాటు ఇండియన్ నేవీ కూడా రంగంలోకి దిగాయి. ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ ఏజెన్సీలు సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. కార్మికులను రక్షించేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు కొనసాగించాలని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. వాటర్ ఫ్లోటింగ్ సహాయక చర్యలకు ఆటంకంగా మారిందని, నిరంతరం నీటిని బయటకు తోడేయటంతో పాటు సొరంగంలోనికి ఆక్సిజన్ అందించే ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. టన్నెల్ లో కూలిన మట్టి దిబ్బలను



తొలగించి ప్రమాదం జరిగిన చోటికి చేరుకునే ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

**ఎనిమిది మందిని కాపాడడం కోసం సర్వశక్తులు- మంత్రి ఉత్తమ్**

ఎనిమిది మందిని కాపాడడం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నామని నీటపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సంఘటనా స్థలిలో పరిస్థితి గంబీరంగా మారింది. ఈ తరహా సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు భారత సైన్యం సాహసోపేతంగా రెస్క్యూ చర్యలు తీసుకుంటుందని, ఎన్.డి.ఆర్.ఎఫ్,ఎస్.డి.ఆర్.ఎఫ్ బలగాలను రంగంలోకి దింపామని, ఇంజినీరింగ్ అధికారులతో పాటు సహాయక చర్యలు చేపట్టిన వారితో ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతున్నామన్నారు. సంఘటన జరిగిన మరుక్షణం నుండి సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైందని, ప్రధాని మోడీ,ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లు పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారన్నారు. టన్నెల్ ప్రమాద ఘటనను చిల్లర రాజకీయాలు చేయవద్దన్నారు. పదేళ్ల పాటు ప్రాజెక్టు పెండింగ్ లో పెట్టి ఇప్పుడు విమర్శలా అంటూ బీఆర్ఎస్ నేతలపై విరుచుకుపడ్డారు. ఎస్.ఎల్.బి.సి ని బి.ఆర్.ఎస్ పాలకులు చేసిన నిర్లక్ష్యం కుడా ప్రమాదానికి కారణం అయి ఉండొచ్చని, ఏ టన్నెల్ నిర్మాణం జరిగినా లీకేజ్ లు సర్వసాధారణమన్నారు. బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో కుడా ఈ తరహా లీకేజ్ లు ఏర్పడ్డాయని, సొరంగం తవ్వకాల సమయంలో ఏర్పడ్డ లీకేజ్ ప్రమాదానికి కారణం అయి ఉండొచ్చన్నారు. టన్నెల్ ప్రమాద ఘటనలో బి.ఆర్.ఎస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని, కమిషన్లు తప్ప ప్రాజెక్ట్ ల నిర్మాణాల గురించి పట్టించుకోని వారు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

**పరిస్థితి తీవ్రం**

ప్రమాద స్థలంలో పరిస్థితి తీవ్రంగా ఉందని, నీటి ప్రవాహం సహాయ చర్యలకు ఆటంకం కలిగిస్తుందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. నీటి నిల్వలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, టన్నెల్ లోని మట్టి దిబ్బలను తొలగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నామని వివరించారు. టన్నెల్ లోని సహజ రాతి నిర్మాణాలు సడలడంతో అకస్మాత్తుగా నీరు, మట్టి ప్రవహించాయన్నారు. దాంతో టన్నెల్ లో 12 13 అడుగుల వరకు నీరు నిండిపోయిందన్నారు. ఇది అత్యంత క్లిష్టమైన పరిస్థితి, దీనిని పరిష్కరించేందుకు సాంకేతిక నిపుణులు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారు," అని ఆయన వివరించారు. ప్రమాద ప్రాంతం భౌగోళికంగా క్లిష్టమైన ప్రదేశం కావడంతో భారీ యంత్రాలను అక్కడికి చేర్చడం కష్టంగా మారిందని తెలిపారు. అయినప్పటికీ, అధికారులు ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంభించి మట్టి దిబ్బేలు తొలగించేందుకు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ, విపత్తు నిర్వహణ బృందాలు, రక్షణ దళాలు సంయుక్తంగా సహాయ చర్యలు నిర్వహిస్తున్నాయని, నిరంతరం ఆక్సిజన్ పంపిణీ కొనసాగుతోందని, డీ వాటరింగ్ కోసం మోటార్లు వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు.

**చివరివరకు ప్రయత్నాలు - మంత్రి జూపల్లి**

ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది పరిస్థితి ఆశాజనకంగా లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. అయితే చివరి వరకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఆదివారం దోమలపెంటలోని ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలను మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం దోమలపెంటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కార్మికుల ఆచూకీ లభ్యం కావడానికి మరికొంత సమయం పడుతుందన్నారు. 8 మంది కార్మికుల రక్షణ కోసమే తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. టన్నెల్‌లోనే దాదాపు ఐదు గంటలు పాటు జూపల్లి కృష్ణారావు గడిపారు.

## సీఎంగారు... మీలో పౌరుషం చచ్చిపోయిందా?

### కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు

**మంచిర్యాల, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో పౌరుషం, చీము నెత్తురు చచ్చిపోయినట్లుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాల జిల్లా చెన్నూరు లో పర్యటించిన బండి సంజయ్ "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు.... మీలో పౌరుషం చచ్చిపోయిందా? ఆనాడు మీ బిడ్డ పెళ్లినాడు కేసీఆర్ ప్రభుత్వం అక్రమంగా మిమ్ముల్ని అరెస్ట్ చేయించి జైల్లో వేయించిందన్నవ్ కదా? మిత్తీతో సహా చెల్లిస్తానని చెప్పినవ్ కదా? మరి ఈనాడు మీరే సీఎంగా ఉన్నారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, ఫార్ములా ఈ రేసు స్కాముల్లో కేసీఆర్ కుటుంబ పాత్ర ఉందని, ఆధారాలున్నాయని మీరే స్వయంగా చెప్పారు కదా? 14 నెలలైనా ఎందుకు అరెస్ట్ చేయలేదు? మీలో నిజంగా పౌరుషం చచ్చిపోయిందా? అని బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చెన్నూరులోని కేతన్ పల్లి ఎమ్మెన్నార్ గార్డెన్ లో మంచిర్యాల జిల్లా బీజేపీ ప్రభారీలతో నిర్వహించిన సమావేశంలో బీజేపీ



ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ బలపర్చిన గ్రాడ్యుయేట్ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డితోపాటు స్థానిక నేతలతో కలిసి బండి సంజయ్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు.

## నెక్లస్ రోడ్‌లోని నీరా కేఫ్‌ను మూసివేయం

### నీరా ఆరోగ్యానికి మంచిది.. స్పష్టం చేసిన ఎక్సైజ్ శాఖ

**మహా :** నెక్లెస్‌రోడ్డులో ఉన్న నీరా కేఫ్‌ను తొలగిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ ప్రభుత్వం ఖండించింది. ఈ మేరకు నీరా కేఫ్‌పై ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నీరా కేఫ్‌ను మూసివేయాలనే ప్రతిపాదనలు తమకు లేవని స్పష్టం చేశారు. మొదటి నుంచి ఫుడ్ కోర్టులు కేఫ్‌లో భాగంగానే ఉన్నాయని తెలిపారు. నీరా కేఫ్‌ను తొలగించి అక్కడ హోటళ్లు ఏర్పాటుచేసే ప్రతిపాదనలు లేవని తేల్చిచెప్పారు. నీరా కేఫ్‌ను డాక్టర్ వినోద్ గౌడ్‌కు చెందిన మెస్సర్స్ తనీరా పామ్ ప్రొడక్ట్స్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహిస్తోందని తెలిపారు. నీరా కేఫ్ ఇప్పటికీ తన కార్యకలాపాలను కొనసాగిస్తోందని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది.

**నీరా ఆరోగ్యానికి మంచిది**

హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో సుమారు రూ.12 కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో నీరాకేఫ్‌ను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తాటి మొద్దులు, ఈత మొద్దులపై కూర్చోడానికి వీలుగా సీట్లను డిజైన్ చేశారు. వాటిపై కూర్చుని ముచ్చట్లు చెప్పుకుంటూ నీరా తాగడానికి ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడి ఫుడ్ స్టాల్‌లో తెలంగాణ వంటకాలను సైతం వడ్డిస్తారు. ఒక్క మనాటలో చెప్పాలంటే గీత కార్మికుల అస్తిత్వానికి ప్రతీకగా నీరాకేఫ్ ఉంది. ఇతర పానీయాలతో పోల్చితే నీరా ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇప్పటి వరకు కాంబోడియా, ఆఫ్రికా, ఇండోనేషియా, మలేషియా, శ్రీలంక వంటి దేశాల్లో నీరా ఉత్పత్తి అధికంగా ఉంది. హైదరాబాద్ నగరంలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన నీరాకేఫ్ నగరజీవులకు కొత్త రుచులు అందిస్తోంది. పక్కనే హుస్సేన్‌సాగర్.. చిటపట చినుకులు పడుతూ ఉంటే.. వెచ్చగ గొంతులోకి నీరా దిగుతూ ఉంటే.. చెప్పలేని ఆ హాయి కోసం ఇక్కడికి ఎంతోమంది వచ్చి సేద తీరుతుంటారు.



## ఢిల్లీ విపక్ష నేతగా అతిషీ

### ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఆప్ శాసనసభా పక్షం


### పాల్గొన్న 22 మంది ఆప్ ఎమ్మెల్యేలు

**మహా :** ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు, మాజీ సీఎం అతిషి ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. ఆప్ శాసనసభా పక్ష సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలిగా ఒక మహిళా ఎంపిక కావడం ఇదే మొదటిసారి. ఆదివారం ఆప్ శాసనసభ పక్ష సమావేశం జరిగింది. 22 మంది ఆప్ ఎమ్మెల్యేలు ఇందులో పాల్గొన్నారు. ప్రతిపక్ష నాయకురాలుగా అతిషి పేరును ఎమ్మెల్యే సంజీవ్ ఝూ ప్రతిపాదించారు. ఢిల్లీ సీఎం రేఖ గుప్తాను ఎదుర్కొవడానికి బలమైన మహిళా నేతగా అతిషిని పేర్కొన్నారు. దీంతో ఆప్ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమెను ఎన్నుకున్నారు. ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాwయకురాలుగా తనను ఎన్నుకోవడం పట్ల అతిషి హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచినందుకు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, పార్టీ ఎమ్మెల్యేకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. బలమైన ప్రతిపక్షం ప్రజల గొంతును లేవనెత్తుతుంది. బీజేపీ ఇచ్చిన అన్ని వాగ్దానాలు నెరవేర్చేలా ఆప్ ప్రయత్నిస్తుంది అని అతిషి ర్కొన్నారు.

## లీజుకు పర్యాటక ఆస్తులు

### 35 ఆస్తులను గుర్తించిన అధికారులు.. ఆదాయ పెంపుపై ప్రత్యేక దృష్టి

**మహా :** రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల వద్ద నిర్మించిన హోటళ్లు, రెస్టారెంట్లు, స్థలాలను ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది. పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన సుమారు 35 ఆస్తులను లీజుకు ఇవ్వనున్నారని విశ్వసనీయంగా తెలిసింది. పర్యాటక ప్రాంతాల్లో విశాలమైన ప్రదేశాల్లో, వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి పర్యాటకాభివృద్ధి సంస్థ నిర్మించిన ఈ వసతి సదుపాయాల నిర్వహణ అనుకున్నంత మెరుగ్గా లేదు. దీంతో ఈ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు లీజు కింద అప్పగిస్తే భవనాల నిర్వహణ మెరుగుపడటంతో పాటు సంస్థకు ఆదాయం కూడా సమకూరుతుందని సర్కారు భావిస్తోంది. పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యం, మనోహర దృశ్యాల దృష్ట్యా వస్తున్న సందర్శకులు.. అక్కడున్న వసతి కూడా బాగుందని భావిస్తే ఆ విషయం విస్తృత ప్రచారంలోకి వచ్చే అవకాశాలున్నాయి. అది రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ పర్యాటకుల సంఖ్యను కూడా పెంచేందుకు ఉపకరిస్తుంది. ఇదే ఉద్దేశంతో పర్యాటక సంస్థ నడుపుతున్న పలు ఆస్తులను ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు సర్కారు రంగం సిద్ధం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే అప్పటి ఆంధ్రప్రదేశ్ లోని పలు పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాల వద్ద హరిత ప్లాజాల పేరుతో స్టార్ హోటళ్ళను తలపించే విధంగా హోటళ్ళు, రెస్టారెంట్లను నిర్మించారు. ఇందులో కొన్ని చోట్ల హరిత ప్లాజాలు ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నప్పటికీ మెజారిటీ హోటళ్ళు పర్యాటక



శాఖకు భారంగా మారాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహణలో విపరీతమైన లోపాలున్నట్లు అధికారులు గుర్తించారు. సిబ్బంది పనితీరులో నిర్లిప్తత, పర్యవేక్షణాలోపం కూడా తోడవడంతో హరిత ప్లాజాలంటే పర్యాటకులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలు తదితర ప్రాంతాలలోని పర్యాటక శాఖలో ఉన్న హోటళ్ళు, రిసార్ట్ లను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇచ్చే ప్రతిపాదనను చురుగ్గా పరిశీలిస్తోంది. త్వరలోనే ఇందుకు సంబంధించి స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

**సిబ్బంది కొరత.. లీజు బకాయిలు రూ. 400 కోట్లు**

సుమారు రూ.400 కోట్లకు పైగా పర్యాటక సంస్థకు లీజు బకాయిలు రావాల్సి ఉందని అంచనా. ఎప్పటికప్పుడు లీజు మొత్తాన్ని వసూలు చేయడానికి అవసరమైన యంత్రాంగం పర్యాటక సంస్థలో అందుబాటులో లేకపోవడంతో రూ.వందల కోట్ల మేర బకాయిలు పేరుకుపోయినట్టు ఆరోపణలున్నాయి. రాజకీయ సిఫారసులతో పర్యాటక సంస్థ ఆస్తుల లీజు దక్కించుకున్న కొందరు బడా బాబులు రూ. కోట్ల బకాయిలు చెల్లించకుండా ముఖం చాటేశారు. మరికొంత మంది లీడజు కాలానికి మించి పర్యాటక భవనాలను వినియోగించుకుని తర్వాత బకాయిలను కూడా చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. పేరుకు పోయిన బకాయిలను లెక్కించి సదరు లీజు దారుల నుంచి వసూలు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## గురుకులాల ప్రవేశ పరీక్షలు ప్రశాంతం

**ఇబ్రహీంపట్నం, మహా:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం జరిగిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఐదవ తరగతి విద్యార్థుల ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలురు పాఠశాలలో మరియు నల్లకంచ బాలికల గురుకుల పాఠశాలలో సుమారు 1000 మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించగా దాదాపుగా అందరూ హాజరై ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం 5 6 7 8 9 తరగతులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షలలో ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరై పరీక్షలు రాయడం జరిగింది. మండల రెవెన్యూ అధికారులు, ఆదాయ ధ్రువీకరణ పత్రంలో గ్రామీణ ప్రాంతాలలో 1,50,000 ఉండగా, ఆ విద్యార్థికి రెండు లక్షల వరకు ఆదాయం ఉండడంతో, దాని కారణంగా అధికారులు పరీక్ష రాయకుండా తిరిగి పంపించడం జరిగింది. మండల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల, మా కుమారుడు





ప్రవేశ పరీక్ష రాయకుండా వెనుతిరగడం జరిగిందని విద్యార్థి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. మరో ఇద్దరు విద్యార్థులు పరీక్షా కేంద్రం వరకు వచ్చి పరీక్ష రాయకుండా బాధతో వెను వెనుతిరగడం జరిగింది. పరీక్షా కేంద్రంలోని అధికారులను ప్రశ్నించగా మాకు వచ్చిన గైడ్లైన్స్ ప్రకారం అర్హులైన విద్యార్థులను అందర్నీ పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరిగిందని, రిజెక్ట్ అయిన ముగ్గురిని తిరిగి పంపించడం జరిగిందని తెలిపారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. ఓఎంఆర్ ఆన్సర్ షీట్లను (జవాబు పత్రాలు) పరీక్ష అనంతరం పోలీస్ స్టేషన్ అధికారులకు అప్పగించడం జరిగిందని, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మెర్సీ వరూధిని వెల్లడించారు.

## ఏప్రిల్ 8, 9 తేదీల్లో ఏఐసీసీ కీలక సమావేశాలు

### అహ్మదాబాద్ వేదిక

**మహా:** గతేడాది డిసెంబర్‌లో కర్ణాటకలోని బెళగావిలో జరిగిన నవ సత్యాగ్రహంలో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా ఏఐసీసీ సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేశారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా జాతీయ కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశాలు జరగనున్నాయి. ఏప్రిల్ 8 వ తేదీన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరగనుండగా, ఏప్రిల్ 9న ఏఐసీసీ ప్రతినిధుల సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ రెండు సమావేశాలకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా జాతీయ కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశాలు నిర్వహించనుంది

## ఆసియా ఖండంలోని అత్యున్నత సమీకృత మార్కెట్

### నూతన మార్కెట్ పరిపాలన అనుమతులు మంజూరు

- 200 ఎకరాలలో 2900 కోట్లతో ఆధునిక మార్కెట్
- రైతులకు వర్తకులకు వినియోగదారులకు సౌకర్యార్థంగా
- రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ కె సురేంద్రమోహన్

**అబ్దుల్లాపూర్ మెట్టు, మహా:** కోహెడలో నిర్మించబోయే నూతన మార్కెట్ కి త్వరలోనే పరిపాలన అనుమతులు మంజూరు చేస్తామని ఐఏఎస్ అన్నారు. అబ్దుల్లాపూర్ మండలం, కోహెడ రెవెన్యూ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ కె సురేంద్రమోహన్ (ఐఏఎస్) వెల్లడించారు. ఆసియా ఖండంలోనే అధునాతన సమీకృత మార్కెట్ గా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఆదివారం ఉదయం ప్రభుత్వ ఆదేశాలతో కోహెడలో నిర్మించబోయే నూతన మార్కెట్ ప్రాంతాన్ని డైరెక్టర్ సురేంద్రమోహన్ స్వయంగా పరిశీలించారు. అనంతరం బాటసింగారంలో కొనసాగుతున్న పండ్ల మార్కెట్ క్రయవిక్రయాలను పరిశీలించిన డైరెక్టర్ సురేంద్రమోహన్, అధికారులు, పాలకవర్గం సిబ్బందితో ప్రత్యేక భేటీ అయ్యి మార్కెట్ యొక్క వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోహెడ ప్రాంతంలో నిర్మించబోయే సమీకృత మార్కెట్ ను ఆదివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ నూతన డైరెక్టర్ గా నియమితులైన కే సురేంద్రమోహన్(ఐఏఎస్) గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుకా మధుసూదన్ రెడ్డి మరియు పాలకవర్గం, సంబంధిత అధికారులతో కలిసి అట్టి ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించడం జరిగింది. డిపిఆర్ ప్లాన్ ప్రకారం ఎక్కడ ఎలాంటి కట్టడాలు నిర్మించాలో అట్టి ప్రాంతాన్ని చూడడం జరిగింది. అనంతరం బాటసింగారంలో నడుస్తున్న పండ్ల మార్కెట్ ప్రాంతాన్ని పాలకవర్గం, అధికారులతో కలిసి అక్కడ చేపడుతున్న క్రయవిక్రయాలను దగ్గరుండి పరిశీలించడం జరిగింది. ఏయే ప్రాంతాల నుండి ఎలాంటి దిగుమతులు వస్తున్నాయో ఇక్కడ నుండి ఇతర ప్రాంతాలకు ఎలాంటి ఎగుమతులు



జరుగుతున్నాయో స్వయంగా వర్తకులను అడిగి తెలుసుకోవడం జరిగింది.. అదేవిధంగా మార్కెట్లోకి వచ్చే రైతులను, వినియోగదారులను కలుసుకొని వారు ఎదుర్కొనే సమస్యలను వినడం జరిగింది. అనంతరం గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం మరియు అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ కె సురేంద్రమోహన్ (ఐఏఎస్) మాట్లాడుతూ... ఆసియా ఖండంలోని అత్యున్నత స్థాయి సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశం మన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఉన్నదని, త్వరలో ముఖ్యమంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో సమీక్ష సమావేశం నిర్వహించి కోహెడ మార్కెట్ కి పరిపాలన అనుమతులు మంజూరు చేస్తామని. కొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం కూడా జరిపిస్తామని తెలియజేశారు. కోహెడ మార్కెట్లో పండ్లు, పాల ఉత్పత్తులు, డ్రై ఫ్రూట్స్, మాంసాహార ఉత్పత్తులు, పూలు వంటి ఉత్పత్తులకు అవకాశం ఉందన్నారు. దాదాపు 200 ఎకరాలలో 2900 వందల కోట్లతో ఇట్టి ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టబోతున్నామని చెప్పారు. ఇక్కడ మార్కెట్ కి విచ్చేసే రైతులకు గాని వినియోగదారులకు గాని ఉత్పత్తుల అమ్ముకునే వర్తకులకు



గాని ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యున్నత స్థాయి సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు అత్యున్నత స్థాయి కోల్డ్ స్టోరేజిలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం నడుస్తున్న బాటసింగారం తాత్కాలిక పండ్ల మార్కెట్లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని దానిని అధిగమించేందుకు కోహెడ మార్కెట్ ని త్వరలోనే అందుబాటులోకి తెస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అదనపు సంచాలకులు లక్ష్మణుడు, జాయింట్ డైరెక్టర్ మల్లేశం, జిల్లా మార్కెటింగ్ రిజిస్టర్ రియాజ్, కోహెడ మార్కెట్ కన్సల్టెంట్ ఉమామహేశ్వర రావు, వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరాచారి, మార్కెట్ సెక్రటరీ ఎల్ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు, రైతులు, వినియోగదారులు, వర్ధకులు తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 24-02-2025



## అతను...

వెన్నెల ఘనీభవించినట్టు
ఒక్కసారిగా సముద్రపు అలలు నిలబడిపోయినట్టు
సాగుతూ సాగుతూ నదీ ప్రవాహం వెనక్కి మల్లి
చూసుకున్నట్టు నాలుగడుగులు వేయకుండానే వేల మైళ్ళ
దూరం నడిచినట్టు నేరం చేయకుండానే బందీ అయినట్టు
వేల టన్నుల నిశ్శబ్దాన్ని మౌనంగా భుజాలపై మోస్తూ..
అతను క్షణం క్షణం ఇసుక కుప్పలా కూలిపోతున్నాడు



డా . రూప్ కుమార్ డబ్బీకార్,
91778 57389

# తమకం

అప్పుడే అచ్చు నుంచి వచ్చిన
కొత్త పుస్తకం కమ కమ్మని వాసన
కమ్మలన్నీ ఒక్కొక్కటి మర్లేస్తుంటే
మంద్ర పారవశ్యంలో నాసిక పుటలు

తెల్ల కాయిదం మీద నల్లని అక్షరాలు
సాల్లు సాల్లుగా వాక్యాలైన అభివ్యక్తులు
పేజీ లేఔట్ తో పేరాలు పేరాలుగా పుటలు
నయనాల్లోకి జారుతున్న ఉల్లేఖనాలు

అసలు ఆ తాజా పుస్తకం చేతికందగానే
ముఖం మీద వెలుగుల నవ్వులు
అట్టను ఒకసారి అటూ ఇటూ
చేతి వేళ్లతో సుతారంగా తాకి చూస్తే
సంకలనం సాంతం సుకుమార కోమలీకం
కవర్ పేజీ డిజైన్ కండ్ల నిండుగ కనిపించి
మనసు నిండిపోయిన పఠన సంతృప్తి
ఆ దళసరి పత్రాలు ముట్టుకుంటేనే
మురిపెం

మేక పిల్ల ఎగిరెగిరి తుమ్మాకుల తిన్నట్టు
వాకిట్ల కోడి పిల్లలు నూకలకు ఉరికినట్టు
పసిపాప తమకంగా పాయి తాగుతున్నట్టు
గ్రంథం మస్తిష్కానికి బలవర్ధక ఆహారం

కొత్త కొత్త సామాజిక శాస్త్రాల
ఆవిష్కరణలు
రగ రగ తరంగ ఆలోచనల బీజ వ్యాపనలు
పొత్తం మనో ఆకాశంలో జవజవలాడే
పతాకం.



అన్నవరం దేవేందర్ కవిత
9440763479

# వినమ్రత



దర్భశయనం శ్రీనివాసాచార్య
94404 19039





కవిత్వ కళ పట్ల అభిరుచి కలిగి, దానిలో నిమగ్నమై ధ్యాసతో మెలకువతో అవగాహనతో పని చేసే కవి నిస్సందేహంగాతన పరిధిలో ఒక విశిష్ట కళాప్రపంచాన్ని సృష్టిస్తాడు. అందుకు అతని కృషి అభినందనీయమే.

అయితే అతను తన సృజనకు అవసరమైన ప్రాథమిక మూలకాలను సమాజం నుంచో , పరిసర ప్రకృతి నుంచో లేదా ఆ రెంటి నుంచో స్వీకరిస్తాడు. వాటికి తన అనుభవాన్నీ , ఊహాశాలిత్వాన్ని జోడిస్తాడు . అట్లా రూపొందే అతని సృజన విశిష్టంగా వుంటే అందుకు అతని వైయక్తిక ప్రతిభ ఎంత కారణమో , మూలకాలను అందించిన సమాజమూ పరిసర ప్రకృతీ అంతే కారణం. కనుక కవి దేని నుంచి తాను మూలకాలను పొందుతున్నాడో, వాటి పట్ల కవి వినమ్రత కలిగి వుండడం సమంజసం.

ఏ భాష అయినా ఎప్పుడో గత కాలంలో పుట్టి పరిణామం చెందుతూ ఇప్పటి రూపానికి చేరింది. ఆ భాషను కవి స్వీకరించి దానికి తనదైన శక్తిని జోడిస్తాడు. అట్లా సంపద్వంతమైన భాషతో అతని సృజన గొప్పగా వెలిగినట్లయితే ఆ వెలుగుకు అతని శక్తి మాత్రమే కారణం కాదు. అతను స్వీకరించిన భాషను అంతకు మునుపే రూపొందించిన తరతరాల మనుషుల కృషి కూడా కారణం. అందుకని భాషను రూపొందించి అభివృద్ధి చేసిన పూర్వ భాషావేత్తల పట్ల కవి వినమ్రత కలిగి వుండడం సమంజసం. తన రచనలలో ప్రజల పలుకుబడిని సందర్భానుసారంగా కవి వాడితే ఆ ప్రజల పట్ల కూడా అతను వినమ్రత కలిగి వుండడం సమంజసం.

కవి సృజన శీలి మాత్రమే కాక ఒక చదువరి కూడా. ఎప్పటికప్పుడు తన లోపలి ప్రపంచాన్నీ, చుట్టూ కదిలే మనుషులను చదువుకోవడంతో పాటు, తన పూర్వ కవుల, వర్తమాన సహకవుల, రచయితల రచనలను చదువుతుంటాడు. వారి నుంచి తెలుసుకున్న జ్ఞానంతో తన సృజనకు మెరుగులు పెట్టుకుంటాడు. అందువల్ల అతను తన పూర్వ సాహిత్య కారుల పట్ల సహ కవుల , రచయితల పట్లా వినమ్రత కలిగి వుండడం సమంజసం.

చరిత్ర ఒక అమూల్యమైన నిధి. కవి చరిత్ర నుంచి ఎంతో తెలుసుకుంటాడు. దాన్ని అవసరమైన చోట్లలో తన సృజనకు అన్వయించుకుంటాడు. అందుకని కవి చరిత్ర పట్లా , చరిత్రను నిర్మించిన మనుషుల పట్లా వినమ్రత కలిగి వుండడం సమంజసం.

ఏ కవీ రాత్రికి రాత్రే గొప్ప సృజన కారుడు కాలేడు, తొలి దశలో తన తల్లో , తండ్రో , స్నేహితుడో, ఉపాధ్యాయుడో , పూర్వ కవో , వర్తమాన కవో తనకు సృజన పట్ల ఆసక్తి రేకెత్తించి వుంటారు. ఆ ఆసక్తితో మెదలైన అతడు తప్పటడుగులు వేసినపుడు ఎవరో తోడు నిలిచి కొంత దూరం నడిపించి వుంటారు. క్రమంగా సాధనతో కొంత కాలానికి అతను విశిష్ట కవి కావచ్చు. అపుడు అతను తనకు తొలి దశలోనూ ఆ పిదపా ప్రేరణగా , అండగా నిలిచిన వారి పట్ల వినమ్రత కలిగి వుండడం సమంజసం .

ఏ ఒకరిద్దరో తప్ప దాదాపు కవులందరికీఒక కుటుంబం వుంటుంది. జీవిత భాగస్వామి, పిల్లలూ వుంటారు . వారి తోడ్పాటూ, సహకారం లేకుండా ఎక్కువ కాలం ఏ కవీ సాధనా, ప్రయాణమూ చేయలేడు. ఆ కుటుంబ సభ్యులకు కవికున్నంత కళాజ్ఞానం లేకపోవచ్చు. కానీ అంతకు మించిన సహృదయత, ఔదార్యం వుండడం వల్లనే కవి కృషికీ ,ప్రయాణానికి సహకరిస్తారు. కనుక వారి పట్ల అతను వినమ్రత కలిగి వుండడం సమంజసం.

> **తన మనుగడ కోసం, తన సృజన కోసం కవి అసంఖ్యాకుల మీద ఆధారపడతాడు. కనుక వారి కంటే కవి ఉన్నతుడు కాదు. అంటే రైతు కంటే , శ్రామికుడి కంటే , శాస్త్రజ్ఞుడి కంటే, నిజాయితీతో పనిచేసే ఉద్యోగి కంటే , సమాజ చలనానికి దోహదపడే మరెవరి కంటే కూడా కవి ఉన్నతుడు కాదు. ఒక వేళ ఫలానా కవి చాలా మంది కన్నా ఉన్నతుడు అని సమాజం భావించి గౌరవిస్తే సన్మానిస్తే అది సమాజపు సహృదయత. అట్లాంటి సమాజపు సహృదయతను కవి సరిగా అర్థం చేసుకుని వ్యవహరించడం సమంజసం**

కవి కూడా మనిషే కదా ! అతడు మనగలగడానికి ఒక రైతు కావాలి. ఎంతో మంది శ్రామికులు కావాలి . శాస్త్రజ్ఞులు కావాలి. వైద్యులు కావాలి. ఇంకెందరి సహకారమో కావాలి . కనుక వారి పట్ల అతను వినమ్రత కలిగి వుండడం సమంజసం.

ఈ నేపథ్యంలో చూస్తే కవి సృజన పూర్తిగా అతని స్వంతం అనడానికి వీలు లేదని అర్థమవుతుంది . నిజానికి గతానికి అతను ఒక కొనసాగింపు .విశేష కృషితో కొంత కొత్త జోడింపూ కావచ్చు.


తన మనుగడ కోసం, తన సృజన కోసం కవి అసంఖ్యాకుల మీద ఆధారపడతాడు. కనుక వారి కంటే కవి ఉన్నతుడు కాదు. అంటే రైతు కంటే , శ్రామికుడి కంటే , శాస్త్రజ్ఞుడి కంటే, నిజాయితీతో పనిచేసే ఉద్యోగి కంటే , సమాజ చలనానికి దోహదపడే మరెవరి కంటే కూడా కవి ఉన్నతుడు కాదు. ఒక వేళ ఫలానా కవి చాలా మంది కన్నా ఉన్నతుడు అని సమాజం భావించి గౌరవిస్తే సన్మానిస్తే అది సమాజపు సహృదయత. అట్లాంటి సమాజపు సహృదయతను కవి సరిగా అర్థం చేసుకుని వ్యవహరించడం సమంజసం

సాహిత్య కర్తవ్యాల్లో ఒకటి మానవ సంస్కారాన్ని కాపాడడం ,దాన్ని ఇనుమడింప జేయడం. వినమ్రత అనేది ఒక సంస్కార గుణం. దాన్ని పుణికిపుచ్చుకున్న కవి అటు సాహిత్యానికీ ,ఇటు సమాజానికీ గణనీయమైన ఆరోగ్యవంతమైన చేర్పును ఇస్తాడు.

కవిత్వ రచన అనేది తనకు అధికారాన్నో, ఆధిపత్యాన్నో, నాయకత్వాన్నో ఇచ్చే సాధనం కాదని, అది స్వచ్ఛందంగా తాను తలకెత్తుకున్న బాధ్యత అని భావించే కవి వినమ్రంగా వుండే అవకాశం వుంది. అపుడు అతని పట్లా అతని సృజన పట్లా సమాజానికి విశ్వసనీయత ఏర్పడే అవకాశాలు మెండు. ఆ విశ్వసనీయత వల్ల సాహిత్యాన్ని సమాజం తన మౌలిక అవసరాల్లో ఒకటిగా స్వీకరిస్తుంది. అది కదా మనం కోరుకునేది !

# పరిమళించిన సంస్కృతి ముచ్చట్లు

పుస్తక సమీక్ష







- డా.బి.వి.ఎన్. స్వామి
సెల్ : 9247817732

రోజు రోజుకు పల్లెలు పట్టణాలుగా, పట్టణాలు నగరాలుగా, నగరాలు మహానగరాలుగా విస్తరిస్తున్నవి. వీటికి తోడు పారిశ్రామిక పట్టణాలు, విమానాశ్రయ నగరాలు అనేడి నివాస ప్రాంతాలు నెలకొంటున్నవి. ఈ పరిణామం కొత్తనాగరికతను పాదుకొల్పింది. సంస్కృతి దాని మరుగున పడింది. సంస్కృతి చిత్రణ కూడా మరుగున పడింది. ఎదిగివచ్చిన జీవన విధానాన్ని, పుట్టి పెరిగిన వాతావరణాన్ని మరువని వ్యక్తులు, వర్తమాన నాగరీకం పట్ల అసంతృప్తికి లోనయిన వారు, సాంప్రదాయక దృష్టి అలవర్చుకున్నవారు తమ తరువాతి తరం వారికి సంస్కృతిని అందించడంలో ముందున్నారు. జ్ఞాపకాలుగా, ముచ్చట్లుగా, బాల్యస్మృతులుగా, కథనాలుగా అది విస్తరిస్తున్నది. సంపత్ కుమార్ మాత్రం సంస్కృతి ముచ్చట్లుగా "గంగదర్వాజు"ను రూపొందించిండు. తన అనుభవంలోని యాదిని తెలంగాణ సంస్కృతి మురిపాల ముచ్చట్లు రూపంలో అందించాడు. చాలా వరకు స్వగతంగా మలచిండు. ఎవరూలేని అనాథకు అన్నీ తానై నిలిచిన ఊరు ఒకటి ఉండేది. ఊరునుండి పరాయికరణకు గురైన వారిలో ఈ రచయిత ఒకడు. బొడ్డుతాడును మరువని మనిషితడు. తెలంగాణ సంస్కృతిని బ్రతికించుకోవడానికే కలం పట్టిండు. పాకాల యశోదారెడ్డి బాట పట్టిండు. తెలంగాణ మట్టి పరిమళం నందిని సిధారెడ్డి శిష్యుడయ్యిండు.

కరీంనగర్ పట్టణానికి పక్క గ్రామమైన పోతుగంటి ముంపు గ్రామం. ఈ ప్రాంతంలో గోదావరి నదిని గంగ అనే పిలుస్తరు. గంగ దిక్కు నిలిపిన దర్వాజను "గంగ దర్వాజ" అని అంటరు. "పుట్టిన మంటే గంగపుటుక్కు మంటే గంగ" అనే సామెతనే ఇక్కడి జీవితాలు గంగతో ఏ విధంగా ముడిపడి ఉన్నయో తెలుపుతుంది. ఊరుమ్మడి బతుకును మనసున పట్టించుకున్నడు కనుకనే "గంగ దర్వాజ" అనే పేరు పుస్తకానికి పెట్టిండు. "మురిపాల ముచ్చట్లు"గా చెప్పుకున్నడు. డెబ్బై ఒక్క ముచ్చట్లుగా విస్తరించిన ఈ సంస్కృతీ విశేషం ఒక రకంగా ఒడవని ముచ్చట. గంగలాగే ఇది కూడా జీవధార. ఇతని రచన కవిత్వమై వెలిగిన కథనం. తీయటి ఈతకల్లు లాంటి ప్రాంతోచిత భాష. పుట్ల కొద్దీ సామెతలతో రచన ప్రవాహంలా సాగింది. అనుభవాత్మకము, ఆత్మగతము ఈ రచనాలక్షణము. ముందుతరానికి సంస్కృతిని ఎరుక పరచాలనే ఈ సంభాషణకు రచయిత పూనుకున్నడు.

అభివృద్ధి క్రమానికి దోహదపడిన సాంకేతిక, వైజ్ఞానిక, రాజకీయాది కారకాల పాత్ర గణనీయమైనది. ఆర్థికాభివృద్ధి చర్చ వాటి నమోదుకు అత్యధిక ప్రాముఖ్యత నిచ్చింది. అభివృద్ధికి బాటపడిన క్రమంలోని ఆనంద విషాదాల పట్ల, సుఖదుఃఖాల పట్ల మానవులు వ్యవహరించిన తీరును నమోదు చేయడంలో అలసత్వం కనపరిచింది. మనిషి అలవాట్లు, వేషభాషలు, పూజాదికాలు, పండగపబ్బాలు, జననమరణ తంతు, పనిపాటలు, ఆటపాటలు, విశ్వాసాలు మొదలగునవి మానవుడి పురోగమన స్థాయికి ఆనవాళ్ళు. అవి ఒక తరం నుండి మరొక తరంకు అందివచ్చాయి. ఇవన్నీ ఒక జాతి అభివృద్ధి క్రమానికి జాడలు. వీటిని సంస్కృతిగా పరిగణించవచ్చు. అమలులో ఉన్న సామాజిక నిర్మాణం వల్ల కులం, మతం, భాష, ప్రాంతం, జాతి లాంటి అనేక దొంతరులు ఏర్పడ్డాయి. వీటి వల్ల మరియు వృత్తి విభజన వల్ల కూడా ప్రత్యేక సంస్కృతులు కొలువుదీరాయి. ఒక్కో అస్తిత్వానికి ఒక్కో రకమైన సంస్కృతి ఉంటుంది. వ్యవసాయ సంస్కృతి, శ్రమసంస్కృతి, మధ్యఉన్నతతరగతుల సంస్కృతి, పల్లీయసంస్కృతి, ధనస్వామ్య సంస్కృతి, వైట్కాలర్ కల్చర్ ఇలా అనేకం కనపడతాయి. ఇవన్నీ కూడా మనిషి వ్యవహారదక్షతలను నిరూపించేవే. వీటిని ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత రచయితల పై ఉంది.

ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలు, రాజకీయ కార్యకలాపాల ప్రభావాలు, పేదరిక నిర్మూలనా మార్గాలు, వివిధ అస్తిత్వ సమూహాల ధోరణులు, ప్రజల ఆకాంక్షా ప్రతిఫలనాలు, శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక ఆవిష్కరణల సారాంశాలు, మానవ పురోగమనానికి దోహదపడే ఆలోచనలపై వచ్చినంతగా వస్తున్నంతగా, సంస్కృతి చిత్రణపై రచనలు రావటం లేదు. ఆ ఖాళీని పూరించడానికి మట్టా సంపత్ కుమార్ రెడ్డి "గంగదర్వాజ" (తెలంగాణ సంస్కృతి మురిపాల ముచ్చట్లు) అనే పుస్తకాన్ని వెలువరించాడు. ఈ పుస్తకం వ్యవసాయ సంస్కృతికి అద్దంపట్టింది. విస్తృత సమూహాలు తమ అస్తిత్వం చాటడం కోసం భాష, సంస్కృతి, ప్రదేశం లాంటి ప్రత్యేకతలను ముందుకు తెస్తాయి. వాటి వెనక ప్రత్యేక ఆకాంక్షలుంటాయి. ఆకాంక్షలే విషయంగా సంస్కృతి చిత్రణ ఒక రకమైతే, కేవలం సంస్కృతిని తెలిపే కథనాలు రెండవ కోవలోకి వస్తాయి. ఈ కథనాలే ముచ్చట్ల రూపంలో విలసిల్లుతాయి. డా॥ సి. నారాయణరెడ్డి, డా॥పి. యశోదారెడ్డి

రాసిన "మా ఊరి ముచ్చట్లు" అలాంటివే.
గ్రామీణగర్భంలో పురుడుపోసుకొని పెరిగి విస్తరించిన సంపత్ కుమార్ తన కుదురును మరచి పోలేదు. వ్యావసాయిక వాతావరణాన్ని జీర్ణించుకున్న రచయిత దాన్ని నెమరువేసుకుంటూ మందితో పంచుకున్నాడు. సుఖదుఃఖాల్ని, ఆప్యాయతల్ని, స్నేహాల్ని, ఊరుమ్మడితనాన్ని, పల్లెల స్వయం పోషకత్వాన్ని, నిసర్గ సౌందర్యాన్ని ఒలికించే ప్రాంతోచిత భాషలో అందించాడు. ఆ క్రమంలో ఆయన పలవరించాడు. పలకరించాడు. పులకించాడు. రచనకు ఒక క్రమాన్ని ఏర్పరచుకోలేదు. దాన్ని వింగడిస్తే అనేక విభాగాలు ఏర్పడతాయి. వ్యవసాయం, వైద్యం, ఆహారం, భౌగోళికం, పంటలు, పండగలు, పురుళ్ళు, పుట్టెంటికలు అన్నట్లు అనేక విషయాలను పూసగుచ్చినట్లు చెప్పాడు. "ఊదుకబుక్కుడుఊరుమొకం చూసుడు" అనే సామెతను వాడిన సందర్భం రచయిత వైఖరిని తెలుపుతుంది. రాజన్నగుడిలో జరిగిన సీతారాముల పెండ్లిముచ్చట, సంక్రాంతి పీడపండుగైన వైనం, గరిగబుడ్డికి మరోరూపం గర్భధారణ అని తెలపడం రచయిత ఆసక్తికి నిదర్శనం. శివుడిని "లోకాలశంకరుడు" అని పిలుచుకున్న ప్రజల హృదయసంస్కారం గొప్పది. "దేవుని తలువాలు" ఎంత అర్థవంతమైన పదం. "ధారణ" కార్యక్రమం ముచ్చటగొల్పుతుంది. వ్యావసాయిక సమాజం అందించిన "గంజేగాసం", "గంజిల మెతుకు", "గంజివోసుడు", "పసిగడుగులు", "పులగడుగులు", "గంజినీళ్ళు", "కలినీళ్ళు" మొదలగు పదాలు పలుకుబళ్ళుగా నానుడులుగా, జాతీయాలుగా జనజీవనంలో ఇంకిపోయిన తీరును కళ్ళకు కట్టినట్లుగా చూపాడు. చమిలిముద్దలు, నువ్వుల ముద్దలు మధ్యగల భేదాన్ని ఇగురంగా చెప్పడం ఈయనకే చెల్లింది.

"చెట్టు మీది తిండితినుకుంట చేదబాయిల నీళ్ళు దాక్కుంట పెరిగిన అప్పటి పిల్లలు ఎత్తేస్తే పలుగని చిట్టెపురాళ్ళ లెక్కన గట్టిగుండురు" అనే రచయిత మాట అక్షరాల నిజం. ఈతపండ్లు, మక్క గారెలు, చల్లబొట్టు, ప్యాలాలుపల్లీలు నాటి పిల్లల ఆరోగ్య రహస్యం. 80% భూమి పట్టణీకరణ చెందిన నేటి రోజుల్లో నూడుల్స్, చిప్స్, పిజ్జా, బర్గర్, ఫ్రెంచెస్ వంటి ఫాస్ట్ ఫుడ్స్, అల్ట్రాప్రాసెస్డ్, జంక్ ఫుడ్స్‌తో బడి పిల్లల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. ఫ్యాటీ లివర్, గ్యాస్ట్రిక్ సమస్యలు నమోదవుతున్నాయి. పల్లెల్లో జంక్ఫుడ్ సంస్కృతి పెరిగింది. పిల్లల్లో వచ్చే రకరకాల జబ్బులకు ఔషధాలుగా పనికి వచ్చే గణపత్రి గింజలను "పిల్లల తిండి పలారం బండి" అనే శీర్షిక కింద వివరించాడు. ఔషధం తయారుచేసే విధం కూడా చెప్పాడు. ఈ రోజుల్లో అంటాసిడ్ వాడకం అలవాటయింది. సైడ్ ఎఫెక్ట్ శాతం పెరిగింది. ఇది సంస్కృతిలో వచ్చిన మార్పు ఫలితం. సంస్కృతి కూడా మార్పు చెందుతుంది అనడానికి ఒక ఉదాహరణ ఇది. టైమ్ పాస్ బఠాణీ సంస్కృతి మన జీవితంలో చొరబడ్డాక ప్రతి విషయంలో నెగెటివిటీ పెరిగింది. నాటి మనుషుల ప్రవర్తన ప్రకృతికి రక్షణవలయంగా ఉండేది. అడవిలో కాసే బోడకాకరకాయ, హైబ్రీడుగా మారిన వైనం వ్యాపార సంస్కృతిని తెలియజేస్తుంది. పుట్టి పెరిగిన సంస్కృతి మంటకలుస్తున్న దృశ్యం చూసి "ఆనాటి కట్టుబాట్లు, చెట్లు చేమలకు ఎంత మేలు చేసేవో. కాయలే కాదు, చెట్టును తవ్వి గడ్డను గూడ పెకలించుకు పోయే దరిద్రపు వ్యాపారయుగంలకు జారిపోయిన రోజులివ్వి." అని రచయిత వాపోయాడు. "ఇరిక్కాయ ప్రహసనం" జానపదుల హాస్యప్రియత్వానికి శిఖరాయమానంగా నిలుస్తుంది. నాగరీకంలో బతుకుతున్న రచయిత నవనాడుల్లో వ్యవసాయ సంస్కృతి పాదుకొని ఉంది. నాటి పంటల చక్రాన్ని చెప్పిన విధం చూడండి.

"కాముని పున్నానికి చింతకాయ రాలుడు మొదలయి
ఉగాది పండుక్కు తోట పెరండ్లు లూటి పోవుడు పూర్తయి
రాముని తలువాలు పడ్డయంటే కాయగూరలు ఖతం"
కాముని పున్నం, తోట పెరండ్లు, తలువాలు, పండుక్కు, ఖతం ఇలాంటి పదాలతో కూడిన ఇతని రచన నిసర్గ భాషాసౌందర్యాన్ని పాఠకునికి అందిస్తుంది. పప్పుపచ్చి పులుసు, నికార్సయిన తెలంగాణ వంటకం. పప్పు వండటంలోని రకాలను ఆయన ఏకరువు పెట్టిన తీరు నవ్వు తెప్పిస్తుంది.

పల్లెల్లో జరిగే పండగలను వివరిస్తూ "భూమికి, ఎద్దుకు, ఎవుసానికి, ధాన్యపురాశికి మనుషులు చెల్లించే మర్యాదగా "వంటల పండుగను" పేర్కొంటాడు. నాటి సాంప్రదాయాలు, సామూహికతకు, ఆప్యాయతకు పెద్దపీట వేశాయి. దేవతల వద్ద పెట్టిన పలారాలను పంచిపెట్టేది. దాన్ని గుర్తు చేస్తూ

"రాంద్రి! కొబ్బరి ముక్కలూ చెక్కర ఒకప్పటి పిలుపు
తేంద్రి! కొబ్బరి ముక్కలకు చెక్కర ఈ కాలపు అరుపు"అని ఎద్దేవా చేస్తాడు.

నోరారా పిలిచి పంచడానికి చేయి రాదు. పంచిపెడితే తినే నోర్లు లేవు. ఇది ఈనాటి స్థితి మారిన సంస్కృతి మనిషికి ఒంటరితనాన్ని అందించింది. వర్షాలు బాగా కురిసి ఊరంతా పాడి పంటలతో వర్ధిల్లాలని ఊరి ప్రజలు సామూహికంగా జరుపుకునే పండగ వరుదపాశం. "కోటి ఆస్తులు కూటి కొరకే" అని కళ్ళు తెరిపిస్తాడు. "చెట్ల గుడ్డల్లో మొలకలు... పొత్తిగుడ్డల్లో శిశువు లైనట్లు" అని కవిత్వం వెలయించాడు. "మన నాగరికతలన్నీ నాగలి కత లేనాయె" అనడంలో శ్రమ సంస్కృతి ఉట్టిపడింది. "ముల్లెకాయిసుతనం", "సంపద సాఫల్య కేంద్రం" లాంటి మాటలు జ్ఞాన విస్తరణ దారులు.

"ఎత్తేదా ఈ పెండా ఎన్నో ముద్దోలె
చేసేదా ఈ పెండా చెండూబంతోలే
చరిసేదా ఈ పెండా చందామామోలె"

జానపదులది ఎంతటి అందమైన ఊహ. తమ కార్యానుభవాల్ని పాటలుగా అల్లి గొంతెత్తి నోరారే పాడే వారి జన్మ సార్థకం. అలాంటి పాటల్ని సేకరించిన రచయిత ధన్యుడు.
రాములక్కాయ రుచిని, పచ్చికొత్తిమీర వాసనల్ని, నల్లరేగళ్ళ రంగుల్ని పొదవుకున్న ఈరచన మనల్ని వర్తమాన ఉక్కపోత నుండి గతంలోకి, పల్లెలోకి, అమ్మమ్మ, నాయనమ్మల సమక్షంలోకి తీసుకెళ్తుంది. రాజులను, రాజ్యాలను సైతం యాదికి తెస్తుంది. ఇవాళ ఊరు లేదు. ఊరి యాది మాత్రం ఉంది. అందుకే ఈ తలపోత. ఎవరి తలపోత వాళ్ళది. వాటిని పోతపోసి ముందు తరానికి అందివ్వాలి. ఆ బాధ్యతను నిర్వర్తించిన రచయితకు అభినందనలు.

# గల్తీ



-జూకంటి జగన్నాథం
సెల్:94410 78095

కుంటిదో గుడ్డిదో మూగదో
కల చెయ్యి పట్టుకొని
పోటెత్తిన సాగరాన్ని
కాళ్లకు నీటి చుక్క అంటకుండా
ఆవలి తీరాన్ని చేరాలనుకుంటున్నాను

ఎక్కడ ఎప్పుడు ఎలా
కల్తీ జరిగిందో కానీ
మనిషి గల్తీ అయిపోతున్నాడు

అన్నిటికీ నెపం వాడు అన్నావు
ముక్తి లేని విముక్తి పొందాక
ఇప్పుడు ఇంటి దొంగలే
గజదొంగలు అయ్యారు

కంటికి రెప్పలా కవి
కాపలా కాసినంత వరకు
ఎవని ఆటలు సాగవు
బోకెత్తుల మాటలు చెల్లవు

ఇక్కతులు మీకే కాదు
మాకు ఎరుకనే
నడి బజార్లో ఎవరిని ఎలా నిలబెట్టాలో
ఎప్పుడు కుటిల కుట్ర దారుణ్ణి
అడిగి కడిగి పారెయ్యాలో తెలుసు

రోడ్లు అభివృద్ధికి చిహ్నాలు అంటిరి
అవుననుకొని తలకాయ ఊపితిమి
రహదారులే మమ్ముల్ని బోర్లేసినయని
కుల్లం కుల్లా తెలుసుకునేసరికి
చెర్ల నీళ్లు చెరువు వెనుక పడ్డయ్

సరే కానీతీయ్
మీరు మొగులుకు తంతెలు కడతారా
మేము ఎప్పటికీ చెప్ప కింది మట్టి లాగా
అణిగిమనిగి ఉంటామా

చెవులు కుట్టెటోడు కుడితే నొయ్యయ్
మాకు చెవులు కుట్టుడు తెలుసు
చెవ్వులు పిండుడమూ తెలుసు

పెళ్లి దప్పు కొట్టుడు తెలుసు
మీ ఇళ్ళ ముందట చావు దప్పు
ఎలా కొట్టాలో మాకు తెలుసు

చూస్తుండగానే రోడ్లలో
చిరునామా కోల్పోయాం
కళ్ళ ముందు వ్యవసాయ భూమి
రియల్ ఎస్టేట్ గా
మారిన తరీఖలోనే తప్పిపోయాము

సుళ్లు తిరుగుతున్న నీళ్లలోనా
తేప తేపకు వస్తున్న కన్నీళ్ళలోన
పారిశ్రామికీకరణలో వృత్తిని
పోగొట్టుకున్న
చీకటి నిండిన కార్మికుల జీవితాలు
కాట కలిసిపోయాం

చేదబావి చెరువు
జలాల్లో కలల్లో కులాల్లో
పంట పొలాల్లో దిష్టిబొమ్మను పెట్టి
తీరా కళ్ళు తెరిచి చూసేసరికి
ఊరు ఉసురు కోల్పోతుంది

మతం పేరున గతం పేరున
మనసు పేరును మనిషి పేరున
అస్తిత్వం పేరున దేశభక్తి పేరున
ప్రమాదం పొంచి ఉన్న వేళ
తెగిపోయిన కళ వేలు పట్టుకొని
రద్దీ ప్రవాహాన్ని జిద్దుగా
ప్రవాహానికి ఎదురు ఈది
దాటాలనుకుంటున్నాను

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com | whatsapp- 9247580946



## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు వివరాలివీ..

- ఎస్ఎల్‌బీసీ సొరంగాల పనుల తొలి అంచనా వ్యయం రూ.2,813 కోట్లు
- గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన అంచనా వ్యయం: రూ.4,637.75 కోట్లు
- ప్రాజెక్టులో ఇప్పటివరకు పూర్తయిన పనుల విలువ: రూ.2,689.47 కోట్లు
- ఇంకా జరగాల్సిన పనుల విలువ: రూ.1,948 కోట్లు
- పరిపాలన అనుమతులు జారీ అయినది: 2005 ఆగస్టు 11
- నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్‌తో ఒప్పందం జరిగినది: 2005 ఆగస్టు 28
- ప్రాజెక్టులోని సొరంగాలు: రెండు
- తొలి సొరంగం పొడవు: 43.93 కిలోమీటర్లు
- ఇందులో తవ్వకం పూర్తయిన నిడివి: 34.71 కిలోమీటర్లు
- రెండో సొరంగం పొడవు: 7.13 కిలోమీటర్లు (మొత్తం పూర్తయింది)
- ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో నీరందే ఆయకట్టు: 4.15 లక్షల ఎకరాలు
- తాగునీరు అందే ఫ్లోరైడ్ పీడిత గ్రామాలు: 516
- టన్నెల్స్ పూర్తికి ప్రస్తుత సర్కారు విధించుకున్న గడువు: 202

# నల్లగొండ..

# ఆశల ప్రాజెక్టు ఎస్ఎల్‌బీసీ




## నాలుగుదశాబ్దాల కల.. రెండు దశాబ్దాల ప్రయత్నం

### నాడు వైఎస్సార్ చేతులమీదుగా పనులకు శ్రీకారం.. 2005 ఆగస్టులో పనులు ప్రారంభం

### 43.93 కిలోమీటర్ల తొలి సొరంగం.. 34.71 కిలోమీటర్ల మేర మాత్రమే పూర్తి ఎపుడూ ఆటంకాలే..

### గత ఏడాది మంత్రి కోమటిరెడ్డి పట్టుతో ప్రాజెక్టు పూర్తిపై సర్కారు ఫోకస్

### రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పనుల్లో వేగం

**(మహా ప్రత్యేకం):**

ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల చిరకాల వాంఛ శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు. ఆరు నియోజకవర్గాల్లో 4 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు.. 516 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు.. నాలుగు దశాబ్దాల కాలంగా ముందుకు సాగడం లేదు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ఫుల్ ఫోకస్ పెట్టింది. మంత్రి కోమటిరెడ్డి పట్టుదలతో నాడు వైఎస్సార్ శ్రీకారం చుట్టగా, ఇపుడు రేవంత్ పెండింగ్ పనులన్నీ పట్టాలెక్కించి ప్రాజెక్టు పూర్తికి నడుంబిగించారు. ఇంతలో అనుకోని ఉపద్రవం. సుమారు ఐదేళ్ల తర్వాత టన్నెల్ పనులు ఇటీవల తిరిగి ప్రారంభమయ్యాయి. ఇపుడు అనుకోని ప్రమాదం జరిగింది. నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిది కూడా నల్లగొండ జిల్లానే కావడంతో ఈ పెండింగ్ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

**అడుగడుగునా ఆటంకాలే..**

శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సొరంగం పనులకు అడుగడుగునా ఆటంకాలే. ఈ ప్రాజెక్టు పనులు గత ఇరవై ఏండ్లుగా ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్టు కొనసాగుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4.15లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ పీడిత 516 గ్రామాలకు తాగునీటిని గ్రావిటీ ద్వారా అందించేందుకు ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం ఎడమగట్టు కాల్వ ప్రాజెక్టు (ఏఎమ్మార్పి -ఎస్ఎల్‌బీసీ)ను ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుకు 1979లోనే అంకురార్పణ జరిగింది. 1982 జూలై 29న రూ.480 కోట్లతో సొరంగ మార్గం పనులు చేపట్టాలని నిర్ణయించిన ఉమ్మడి ఏపీ ప్రభుత్వం జీవో 306ను విడుదల చేసింది. అయినా పనులు మొదలుకాలేదు. తర్వాత 22 ఏళ్ల వరకు దాన్ని ఎవరూ పట్టించుకోలేదు.

**వైఎస్సార్ శ్రీకారం**

2005లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు తిరిగి జీవం పోశారు. రూ.2,813 కోట్ల అంచనాతో రెండు సొరంగాల నిర్మాణ పనులకు 2005 ఆగస్టు 11న పరిపాలన అనుమతులు జారీ చేశారు. 2006లో సొరంగం పనులకు శంకుస్థాపన జరిగింది. రెండు సొరంగాల నిర్మాణానికి రూ.2,259 కోట్లతో ఈపీసీ విధానంలో టెండర్లను ఆహ్వానించగా.. రూ.1,925 కోట్లను కోట్ చేసి జేపీ అసోసియేట్స్ లిమిటెడ్ పనులను దక్కించుకుంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి నీటిని తీసుకునేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట (ఇన్‌లెట్) నుంచి నల్లగొండ జిల్లాను ఆనుకొని ఉన్న మన్నెవారిపల్లి (ఔట్‌లెట్) వరకు 43.930 కిలోమీటర్ల పొడవున 10 మీటర్ల వెడల్పుతో తొలి సొరంగాన్ని ప్రతిపాదించారు. శ్రీశైలం జలాశయం నుంచి నీటిని ఈ తొలి సొరంగం ద్వారా తరలించి లింక్ కాల్వ ద్వారా డిండి జలాశయంలోకి చేర్చాల్సి ఉంది. అక్కడి నుంచి లింక్ కాల్వతో 7.13 కిలోమీటర్ల రెండో సొరంగ మార్గంలో తరలించి.. మరో లింక్ కాల్వ ద్వారా పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి నీటిని చేర్చాల్సి ఉంది.

**ఎంతో కష్టంగా పనులు**

43.93 కిలోమీటర్లతొలి సొరంగానికి గాను ఇప్పటి వరకు 34.71 కిలోమీటర్ల మేర పనిపూర్తవగా.. మరో 9.56 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. ఈ సొరంగాన్ని రెండు టన్నెల్ బోర్ మెషీన్ల (టీబీఎం)తో రెండు వైపుల (ఇన్‌లెట్, అవుట్‌లెట్) నుంచి తవ్వుకుంటూ వెళుతున్నారు. శ్రీశైలం జలాశయం ఇన్‌లెట్ నుంచి 13.93 కి.మీ. పనులు పూర్తవగా.. అవతల మన్నెవారిపల్లి (ఔట్‌లెట్) వైపు నుంచి మరో 20.43 కి.మీ తవ్వకం పూర్తయింది. మధ్యలో 9.55 కి.మీ మేర సొరంగం తవ్వాల్సి ఉంది. మరోవైపు డిండి రిజర్వాయర్ నుంచి నీళ్లను పెండ్లిపాక రిజర్వాయర్‌కు తరలించడానికి చేపట్టిన 7.13 కిలోమీటర్ల రెండోసొరంగం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. కానీ అందులో 3.84 కి.మీ. సొరంగానికి మాత్రమే లైనింగ్ పూర్తవగా.. మిగతా 3.29 కి.మీ ప్రాంతానికి లైనింగ్ చేయాల్సి ఉంది.

**ఐదేళ్ళుగా కష్టాలు**

2019లో వచ్చిన భారీ వర్షాలు, వరదల కారణంగా ఇన్‌లెట్ టన్నెల్‌లోకి సీపేజీ పెద్ద ఎత్తున రావడంతో పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి నీటిని తొలగించే ప్రక్రియ మాత్రమే నడుస్తోంది. మరోవైపు ఔట్‌లెట్ వైపు రాయి గట్టిదనం ఎక్కువగా ఉండటంతో టన్నెల్ బేరింగ్ మెషీన్ బేరింగ్, అడాప్టర్, రింగ్ బేర్ దెబ్బతిని 2023 జనవరి 29న పనులు నిలిచిపోయాయి. అమెరికాకు చెందిన రాబిన్స్ కంపెనీ నుంచి బేరింగ్‌ను కొనుగోలు చేసి.. ప్రత్యేక నౌక ద్వారా మన దేశానికి తరలిస్తున్నారు. భారీ పరిమాణంలో ఉండే ఈ పరికరాలు చెన్నైకి చేరుకుని.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఇక్కడికి చేరుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో రెండు వైపులా తవ్వకాలను పునరుద్ధరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తాజా ప్రమాదం కారణంగా ఇప్పట్లో పనులు ప్రారంభించడం కష్టమే.

# మహాకుంభమేళాకు ఫైనల్ టచ్ ఈ అద్భుతమే

## ఇప్పటికే 60 కోట్లు దాటిన పుణ్యస్నానాలు

### అంచనాలను మించి భక్తజనం.. లక్షలాది వాహనాలు రోడ్లపైనే

### 45 కోట్ల మంది వస్తారని యోగి అంచనా.. ఇప్పటికే 60కోట్ల మార్కు దాటిందని ప్రకటన

### మహాశివరాత్రికి మరింతగా భక్తజనం

**ప్రయాగ్‌రాజ్:** యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఆఖరి ఆదివారానికి పుణ్యస్నానాలు ఆచరించిన వారి సంఖ్య 60కోట్లు దాటిందని లెక్కగట్టారు. సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు లెక్కకుమించిన రీతిలో భక్తులు తరలివస్తున్నారు.ఆదివారం రాత్రికి కూడా ప్రయాగ్‌రాజ్ వెలుపల ఎంట్రీపాయింట్‌ల వద్ద లక్షకుపైగా వాహనాలు నిలిచివున్నట్లు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ సరిహద్దుల్లో రీవా పరిధిలోని చాక్‌ఘాట్‌లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాగ్‌రాజ్‌లోని ఏడు ఎంట్రీపాయింట్లను మూసివేయడంతో భక్తులు ఇక్కడి నుంచి 12 కిలోమీటర్ల దూరం నడిచి సంగమస్థలికి చేరుకుంటున్నారు. ఆదివారం నాటికి కుంభమేళాలో పవిత్రస్నానాలు చేసినవారి సంఖ్య 60 కోట్లు దాటింది. మహా కుంభమేళాకు ముందు సీఎం యోగి ఆదిత్యనాథ్ కుంభమేళాకు 45 కోట్లమంది వస్తారని అంచనా వేశారు. అయితే ఆ అంచనా ఇప్పటికే దాటిపోయింది. 73 దేశాల ప్రతినిధులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివచ్చి పుణ్యస్నానాలు చేయడాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు.

**ఆకాశంలో మహాద్భుతం**




ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా లో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఆకాశంలో ఏడు గ్రహాలు బుధ, శుక్ర, మంగళ, బృహస్పతి, శని, యూరేనస్, నెప్ట్యూన్‌లు ఒకే సరళరేఖపై రానున్నట్లు తెలుస్తోంది. ఈ గ్రహాల సమన్వయం నెగటివ్ గ్రహ ప్రభావాలను తగ్గించి, ప్రపంచంలో శాంతి, సమర్థత, సంపద తీసుకురానుందని ఆధ్యాత్మిక వేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ అసాధారణ ఖగోళ సంఘటన కుంభమేళా తుది పవిత్ర స్నానానికి మరింత ప్రత్యేకతను ఇవ్వనుంది. సూర్యుడు, చంద్రుడు మకర రాశిలో ఉండగా, శని కుంభ రాశిలో ఉండగా, బృహస్పతి వృషభ రాశిలో ఉండటం మహాకుంభమేళా ప్రారంభమైంది. కుంభమేళా చివరి రోజు ఫిబ్రవరి 26న గ్రహాల శక్తివంతమైన సమన్వయంతో జరగనుంది. ఆరోజు చంద్రుడు, బుధుడు, సూర్యుడు శని కుంభ రాశిలో ఉండగా, శుక్రుడు, రాహు మీన రాశిలో ఉండగానే బృహస్పతి వృషభ రాశిలో ఉండనుంది. ఈ గ్రహాల మార్పుతో ఫిబ్రవరి 28న గ్రహాలు ఒకే సరళరేఖ వైపు పయనిస్తాయి. ఫలితంగా ప్రతికూలతలు తొలిగి శుభపరిణామాలు జరుగుతాయని శుక్లా తెలిపారు.

**ప్రపంచంలో మార్పులు**

ఫిబ్రవరి 26, 2025న గ్రహాల సమన్వయంతో ప్రపంచంలో ప్రతికూలతలు తగ్గే అవకాశం ఉందని జ్యోతిష్యులు అంచనా వేస్తున్నారు. 2019 నుండి ప్రపంచాన్ని అనేక ప్రతికూల పరిస్థితులు పట్టిపీడిస్తున్నాయి. కోవిడ్19 ,ప్రస్తుత రష్యాఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచం దేశాల్లో అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయితే, గ్రహాల మార్పులతో రష్యాఉక్రెయిన్ యుద్ధం ముగింపు. శాంతి, స్థిరత్వం కొనసాగే అవకాశం ఉందని అన్నారు.



# కళ్యాణ వేడుకల్లో కంది శ్రీనన్న


**ఆదిలాబాద్, మహా :** అభిమానంతో ఆహ్వానించినవారి వివాహాది శుభ కార్యాలకు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. పట్టణంలోని పలు ఫంక్షన్ హాళ్లలో జరిగిన వివాహ వేడుకల్లో ఆయన పాల్గొని పలువురిని కలిసారు.. నూతన దంపతులు సామ గణేష్ రెడ్డి , ప్రవళిక,శ్రీజ రెడ్డి మనీష్ కుమార్ రెడ్డి ,లక్ష్మి ప్రియ సాయి కృష్ణ ,స్నేహ ఆకాష్ లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. నిండూ, నూరేళ్లు సంతోషంగా ఉండాలని, ఆనందమయమైన జీవనం గడపాలని దీవించారు. కొత్త దంపతులకు పెళ్లి కానుకలు బహుకరించి విషెస్ తెలిపారు. వారి కుటుంబ సభ్యులు, బంధువులను ఆప్యాయంగా పలకరించారు. అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ షేక్ ఇమ్రాన్, నాయకులు ఎం.ఏ షకీల్,దొగ్గలి రాజేశ్వర్,మొహమ్మద్ రఫీక్,తమ్మల చందు,మానే శంకర్,డేరా కృష్ణ రెడ్డి,ఎల్మ రామ్ రెడ్డి,తోఫిక్,గడ్డం అఖిల్ రెడ్డి,యెల్టీ ప్రదీప్ రెడ్డి,అంజద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## పర్ధాన్ ల సంక్షేమం కోసం నా వంతు కృషి చేస్తా

### హీరాసుక జయంతి వేడుకల్లో కంది శ్రీనివాసరెడ్డి



**ఆదిలాబాద్, మహా :** పర్ధాన్ సమాజ్ కులస్తుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వం తరపున సంక్షేమ ఫలాలు అందేలా చూస్తానని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రాంలీలా మైదానంలో జరిగిన గోండి ధర్మగురు హీరాసుక జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ...హీరాసుక జయంతి వేడుకలలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే విధంగా తనవంతుగా కృషి చేస్తానని, సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని తెలిపారు. హీరాసుక సూచించిన మార్గాన్ని, అందించిన ధర్మబద్ధమైన, న్యాయబద్ధమైన సిద్ధాంతాలను అనుసరించాలన్నారు. చదువుతో నే భవిష్యత్తు బాగుంటుందని, మగ, ఆడ తేడా లేకుండా పిల్లలను సమానంగా చదివించాలని అన్నారు. అన్ని రంగాల్లో రాణించేలా పర్దాన్ సమాజ్ కులస్తులకు తన ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుందని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులున్నా తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని భరోసా కల్పించారు.అనంతరం హీరాసుక భక్తి పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ షేక్ ఇమ్రాన్,ఎం.ఏ షకీల్,మొహమ్మద్



రఫీక్,దొగ్గలి రాజేశ్వర్,తమ్మల చందు, మానే శంకర్, డేరా కృష్ణ రెడ్డి,ఎల్మ రామ్ రెడ్డి,తోఫిక్, గడ్డం అఖిల్ రెడ్డి, యెల్టీ ప్రదీప్ రెడ్డి,అంజద్ ఖాన్, పర్దన్ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మేస్రం గంగా దేవి,ఆదివాసీ సమాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు రామ్ కిషన్, గౌరవ అధ్యక్షులు ఉయిక సుదర్శన్, మేస్రం శంకర్,ఆదివాసీ నాయకురాలు ఉయిక ఇందిర తదితరులు పాల్గొన్నారు.



## ఆర్కే యువభారత్ ఫౌండేషన్ రాము యాదవ్

## ఏషియన్ తియేటర్లో చావా మూవీ

**ఉప్పల్,మహా:** ఛత్రపతి శివాజీ శంబాజీ మహారాజ్ లు హైందవ సామ్రాజ్యం కోసం, మాతృదేశం కోసం వీరోచితంగా పోరాడి దేశానికి, ధర్మానికి ఆదర్శంగా నిలిచిన వ్యక్తులు అలాంటి మహనీయుల జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని ఆర్కే యువభారత్ ఫౌండేషన్ చైర్మన్ కన్నెబోయిన రాము యాదవ్ తెలిపారు. పీర్జాదిగూడ నుండి సుమారు 250 మంది తో రాము యాదవ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా బయలుదేరి ఉప్పల్ లోనీ ఏషియన్ తియేటర్లో చావా మూవీ ని తిలకించారు.ఈ సందర్భంగా రాము యాదవ్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ,శంబాజి మహారాజ్ లాంటి మహనీయుల చరిత్రను నేటి యువతరం తెలుసుకొని వారి స్పూర్తితో ముందుకు వెళ్లాల్సిన వారు కొన్నేళ్లుగా కుట్రపూరితంగా వక్రీకరణకు గురై దేశ ధర్మ ద్రోహుల చరిత్రలను తెలుసుకుంటున్నారు.కాబట్టి ఇప్పటికైనా యువతరం మేల్కొని ఛత్రపతి శివాజీ శంబాజి మహారాజుల చరిత్రలను పూర్తిగా తెలుసుకొని వారు చూపించిన పోరాటాలను, ధర్మనిష్టలను కలిగి దేశాన్ని, మన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఎంతైనా ఉంది అన్నారు. చావా లాంటి సినిమాలు భవిష్యత్తులో మరిన్ని రావాలని కోరుకుంటూ నిజాన్ని నిర్భయంగా తెలిపిన చావా సినిమా డైరెక్టర్, హీరో, హీరోయిన్లకు, నటీనటులకు అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు.

## డిసిసిబి చైర్మన్ సత్తయ్యకు శుభాకాంక్షలు వెల్లువ

### తుర్కయంజాల్ వింటేజ్ హోమ్స్ కాలనీ నాయకులు

**ఇబ్రహీంపట్నం, మహా:** టీజీ క్యాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను కలిసిన తుర్కయంజాల్ వింటేజ్ హోమ్స్ కాలనీ నాయకులు. డీసీసీబీ మరియు సహకార సంఘాల పదవి కాలాన్ని 6నెలలు పొడిగించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్ మరియు డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన వింటేజ్ హోమ్స్ కాలనీ ప్రతినిధులు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, కాలనీ సభ్యులు నర్సింహా రెడ్డి, అశోక్, బిక్షం తదితరులు పాల్గొన్నారు.



## ప్రభు సాక్షులుగా జీవించండి

### బిషప్ థమన్ కుమార్



**హుజూర్ నగర్, మహా:** ప్రభు సాక్షులుగా జీవిస్తూ యేసు క్రీస్తు నామములో మి జీవితాన్ని భద్రపరచుకోవాలని నల్గొండ పిఠాది పతులు థమన్ కుమార్ అన్నారు.మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయానికి మొదటి సారిగా ఆయన విచ్చేయాగా విచారణ గురువులు ఫాదర్ మార్టిన్ పసల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.ప్రధాన రహదారి నుండి భక్తి పాటలతో మహిళా కొలాటంతో ఊరేగింపుగా ప్రత్యేక వాహనంలో ఆహ్వానం పలికారు.అనంతరం సెంట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు ప్రత్యేక ప్రార్థన గీతంతో సాదరంగా చర్చి లోకి ఆహ్వానించారు.అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజ కార్యక్రమం అనంతరం బిషప్ థమన్ కుమార్ ని ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల విచారణ గురువులు చర్చి కమిటీ పెద్దలు మరియదల సభ్యులు క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

## దుబ్బ శ్రీనివాస్ ను

### పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**వరంగల్,మహా:** ఆర్యవైశ్యమహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్ సంరక్ష ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆసుపత్రి వెళ్లి పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితి యోగ క్షేమలను తెలుసుకొని ధైర్యంగా ఉండాలని మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమం లో సంరక్ష ఆసుపత్రి ఎం.డి పోలా నటరాజ్, మాజీ మార్కెట్ చైర్మన్ టి. రమేష్ బాబు, మాజీ కార్పొరేటర్ దండు దయ సాగర్, జానకి రాములు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 286వ సేవాలాల్ జయంతి వేడుకలు

### జి బిఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ



**వరంగల్, మహా:** గోరు బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 286వ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి వారోత్సవాల్లో భాగంగా గోర్ సేన, గోర్ మలావ్ వెల్ఫేర్ సొసైటీ , ఎల్ హెచ్ పి ఎస్, సేవాలాల్ సేన , పలు ఎస్టి సంఘాలు భారీ బైక్ ర్యాలీ లో పాల్గొని విజయవంతం చేశాయి. ఆదివారము వరంగల్ ఓసిటి నుండి హనుమకొండ దీన్ దయాల్ నగర్ సేవాలాల్ మహారాజ్ దేవాలయం వరకు బైక్ ర్యాలీ సుమారు 500 మంది కొనసాగింది. ఈ ర్యాలీని గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం అధ్యక్షులు, గోర్ సిక్వాడి ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ కున్సోత్ హట్య నాయక్ లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సద్గురు సేవాలాల్ మహారాజ్ ప్రపంచానికి దిక్సూచిగా ఉన్నారని, ఆనాడు సేవాలాల్ మహారాజ్ అహింసకు దూరంగా, బంజారా తండాలు గుడాలలో బంజారాలను జాగృతి చేసి, చెడు అలవాట్లకు దూరంగా ఉంచారని చెడును దూరం చేసేందుకు, గోరు బంజారాలను ఐక్యం చేసేందుకు సేవాలాల్ మహారాజ్ విశిష్ట కృషి చేశారు. అలాగే తాను చేసిన సేవలను గుర్తు గా ప్రతి ఏడాది నగరంలో భోగ్ బండారో కార్యక్రమం, ర్యాలీ కొనసాగిస్తున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని సెలవు దినంగా ప్రకటించాలని, అలాగే గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాలు స్పందించి వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలని వారు కోరారు. దేశంలోని గోర్ బంజారాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలవడం జరుగుతుందని, అలాగే రిజర్వేషన్లు సైతం వేరుగా ఉన్నాయని భారత అఖండ దేశంలో 14 కోట్ల మంది బంజారా లు ఉన్నారని దేశమంతా ఒకే సాంస్కృతి సాంప్రదాయాలతో ఉన్న తమకు రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వాలు అందర్నీ ఒకే కేటగిరికి తీసుకువచ్చి తమ వాటాలు ఇవ్వాలని, పార్లమెంటులో 14 కోట్ల ఉన్న మాకు సుమారు 70 ఎంపీ సీట్లు కేటాయించాలని కోరారు. అనంతరం దీన్ దయాల్ నగర్ లో బండారో గ్రేటర్ లోనీ 31 డివిజన్ దీన్ దయాళ్ నగర్ సేవాలాల్ మహారాజ్ ఆలయ ప్రాంగణంలో భోగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎన్ సీ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్ , ఆర్డీవో రమేష్ రాథోడ్ , గోర్ సేన హనుమకొండ జిల్లా అధ్యక్షులు తేజావత్ ఫణికుమార్ , సంగెం మాజీ జెడ్పిటిసి వీరమ్మ,గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నునావత్ రవీందర్, కోశాధికారి గుగులోత్ తిరుపతి, సహాయ కార్యదర్శి గుగులోతు వినేష్ , గౌరవ అధ్యక్షులు సుందర్, ఎంఈఓ రాము నాయక్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ హుస్సేన్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్, సేవల సేన హన్మకొండ అధ్యక్షులు కున్సోత్ మురళి, సిఐ కాశీరాం సంపత్, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయ న్యూస్ కవరేజ్ కి వచ్చేవారు

## మీడియా పాసులు చూపిస్తే చాలు



ఆలయ ఈ ఓ కొండారెడ్డి

**హుజూర్ నగర్, మహా:** మేళ్లచెరువు మండల కేంద్రములో వేంచేసియున్న శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవస్థానము నందు తేదీ: 08032024 నుండి 12032024 వరకు జరుగు మహాశివరాత్రి జాతరలో ఆలయం లోపలకు న్యూస్ కవరేజి కొరకు వచ్చే ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా విలేకరులు వారి వెంట ఆక్రిడిటేషన్ కార్డు గాని, లేదా పత్రికా/ మీడియా సంస్థ జారీచేసిన గుర్తింపు కార్డు ఆలయ ప్రాంగణంలో డ్యూటీలోయున్న సిబ్బందికి చూపితే ఆలయం లోపలికి అనుమతించబడునని. ప్రెస్ కు ప్రత్యేకముగా జారీచేసే పాసులను నిలిపివేసి మిత్రుల సౌలభ్యము కోసం ఈ రకమైన మార్పులు చేయబడినవి ఆలయ ఈ ఓ కొండారెడ్డి తెలిపారు.

## వేసవిలో త్రాగునీరు,విద్యుత్ కు ఇబ్బందులూ లేకుండా చూడాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నందా లాల్ పవర్



**హుజూర్ నగర్, మహా :** వేసవిలో త్రాగునీరు, విద్యుత్ సరఫరా లోఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందా లాల్ పవర్ తెలిపారు. హుజూర్నగర్ పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ నందు ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా హుజూర్నగర్ డివిజన్లోని మారుముల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారులు సమన్వయంతో కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హుజూర్నగర్ డివిజన్లోని గ్రామాల వారిగా మంచినీటి సరఫరా పరిస్థితిని ఎంపీడీవోలు, మిషన్ భగీరథ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిపిల వారిగా అందుకు సంబంధించి అధికారులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. వేసవిలో త్రాగునీటి సమస్యలు, కరెంటు కోతలకు సంబంధించి గతంలో జరిగిన అనుభవాలను పరిగణంలోకి తీసుకొని, ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలోని ఆవాసాలలో అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. బోరుబావులను బాగు చేయాలన్నారు, వేసవి ప్రభావం ఇప్పటినుండే ప్రారంభమైందని నీటి ఎద్దడి ఎక్కువ ఉండే అవకాశం ఉందని, కావున పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగేనేరేడుచర్ల ,హుజూర్నగర్ మున్సిపల్ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య ,కరెంటు సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పనులకు కూలీలను గ్రామాల వారిగా సేకరించి పనులను చేపట్టాలన్నారు. పంచాయతీ సెక్రెటరీలు తమకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఎంపీడీవోల ద్వారా తన దృష్టికి తేవాలని తెలిపారు. అధికారులందరూ హెల్మెట్ ను తప్పనిసరిగా వాడాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఏ పి డి వివి అప్పారావు, ఆర్డీవో శ్రీనివాసులు, డిపిఓ నారాయణరెడ్డి ,తాసిల్దార్ కే నాగేందర్, ఈ ఈ ఇంట్రా వై శ్రీనివాస్,ఈ ఈ గ్రేడ్ అరుణాకర్ రెడ్డి ,హుజూర్నగర్ మున్సిపల్ కమిషనర్ కే శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నేరేడుచర్ల అశోక్ రెడ్డి ఎంపీడీవోలు ,ఎంపీలు పంచాయతీ సెక్రటరీలు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## గృహిణి సూసైడ్



**ఉప్పల్,మహా:** ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గృహిణి సూసైడ్ చేసుకున్న ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే సూర్యాపేట జిల్లాకు చెందిన మనీషా 24 (గౌడ్), సంపత్(ముదిరాజ్) సంవత్సరం క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. బతుకుదెరువు కోసం రామంతపూర్ కి వచ్చి ఉంటున్నారు. భర్త సంపత్ నిలోఫర్ హాస్పిటల్ లో టెక్నీషియన్ గా ఉద్యోగం చేస్తున్నాడు. భార్యభర్తల మధ్య ఏర్పడ్డ మనస్పర్థల కారణంగా శనివారం అర్ధరాత్రి మనీషా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది.సమాచారం తెలవగానే సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ మార్చురీ తరలించారు. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బంగారం చోరీకి పాల్పడిన కేసులో ముగ్గురు రిమాండ్



**హుజూర్ నగర్, మహా:** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ పరిధిలోనీ మఠంపల్లి మండలంలో తాళం వేసి ఉన్న ఇండ్లనే టార్గెట్ చేసి ఇంటితాళం పలుగలగొట్టి దొంగతనానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. హుజూర్ నగర్ పోలీసు స్టేషన్ ప్రాంగణంలో సీఐ చరమంద రాజు తెలిపిన వివరాల ప్రకారం మఠంపల్లి మండలంలో చోరీకి పాల్పడిన నిందితుల దగ్గర వారి వద్ద నుండి రెండు లక్షల 30 వేల రూపాయల బంగారం స్వాధీన పరుచుకొని మఠంపల్లి ఎస్సై బాబు సమక్షంలో రిమాండ్ కు తరలించారు.

## భార్యపై దాడి చేసిన నిందితుడి అరెస్టు

- నిందితుడి వివరాలను వెల్లడించిన ఏసిపి
- ఇన్స్పెక్టర్ గోపి తోపాటు పోలీసులను అభినందించిన సిపి.. డిసిపి

**వరంగల్, మహా:** వరంగల్ నగరంలోని పోచమ్మ మైదానంలో 20.02.2025 తేదీ గురువారం నిందితుడు కోట చంద్రశేఖర్ కత్తితో భార్య పల్లవి తోపాటు అత్త మామలపై దాడి చేసిన ఘటనలో నిందితుడిని ఎట్టకేలకు మట్టెవాడ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఏసిపి కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి అరెస్ట్ చేసిన నిందితుడి వివరాలతో పాటు నేరం చేసిన తీరును వెల్లడించిన వరంగల్ ఏసిపి నందిరాం నాయక్.. కోట చంద్రశేఖర్, తండ్రి పేరు: రాజు, వయస్సు : 25 సంవత్సరములు, వృత్తి: పెయింటింగ్ వర్క్స్ రాడ్ బెండింగ్ వర్క్స్, నివాసము: ఎస్సీ కాలనీ, నాగమయ్య గుడి దగ్గర, శంభునిపేట, వరంగల్.

**నేరం చేసిన తీరు..**

నిందితుడు పదవ తరగతి వరకు చదువుకొని ఆ తరువాత చదువు మానేసి ప్రస్తుతము రాడ్ బైండింగ్ వర్క్స్ చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో నిందితుడికి వరుసకు మామ అయిన జన్ను బాబు కూతురు పల్లవి పరిచయం కాగా ఇద్దరు ప్రేమించుకొగా, పెద్దల అంగీకారంతో 2022 ఆగస్టులో వివాహం జరిగింది. అప్పటినుండి నిందితుడు చిన్న చిన్న పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం సేవిస్తూ మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలోనే నిందితుడు భార్య చాలాసార్లు వారి తల్లిదండ్రులకు, పెద్దమనుషులకు చెప్పి పంచాయతీ పెట్టించగా పెద్దమనుషులు నిందితుడ్ని మందలించి నప్పటికీ నిందితుడికి అతని భార్యకు మధ్య తరచూ గొడవలు జరుగుతుండడం తో సఖి సెంటర్లో కూడా వీరికి కౌన్సిలింగ్ చేయడం జరిగింది. నిందితుడికి ఒక అబ్బాయి జన్మించాడు. అయినప్పటికీ కూడా నిందితుడు తన పద్ధతి మార్చుకోకపోవడంతో నిందితుడి భార్య పల్లవి తన తల్లిదండ్రుల తో కలిసి వాసవి కాలనీ, పోచమ్మ మైదాన్ లో వేరుగా నివసిస్తున్నది. నిందితుడు చాలాసార్లు తన భార్య పల్లవిని కాపురానికి రమ్మనగా రాకపోవడంతో ఆమె మీద కోపం, పగని పెంచుకొని తన దగ్గరికి భార్య రావడం లేదని అలాగే వేరే వారితో సన్నిహితంగా ఉండడం తో అది సహించలేక తన భార్యను ఏ విధంగానైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం గత నెలలో మిల్స్ కాలనీ ఏరియాలో కత్తులు తయారు చేసే వారి వద్ద మటన్ కోసే కత్తిని 500 రూపాయలకు కొనుగోలు చేసి దాన్ని పదునుగా నూరించి ఇంట్లో దాచిపెట్టుకొని అదను కోసం చూస్తూ తేదీ 20.02.2025 గురువారం రోజు పథకం ప్రకారంగానే కత్తిని బొడ్డు భాగంలో దాచిపెట్టుకొని, మధ్యాహ్నం సుమారు 2 గంటల 45 నిమిషాల ప్రాంతంలో పల్లవి నివసిస్తున్న ఇంటి దగ్గరికి వచ్చి చూడగా, నిందితుడి మామ ఇంటి బయట మనవడికి పాలు త్రాగిస్తుండగా ఇదే అదనుగా భావించి నిందితుడు ఇంట్లోకి వెళ్లి తన వెంట తెచ్చుకున్న కత్తితో భార్య అయిన పల్లవి ముఖం పై విచక్షణారహితంగా దాడి చేశాడు. వెంటనే పల్లవి గట్టిగా అరవగా బయట ఉన్న పల్లవి తల్లిదండ్రులు ఇంటిలోకి వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిని కూడా చంపాలని నిందితుడు వారి ముఖము పై విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నిందితుడు కాలేశ్వరం కు పారి పోయాడు. ఆదివారం తన ఇంటికి వెళ్దామని ములుగు రోడ్డు వద్ద ప్యాసింజర్ ఆటో ఎక్కి కరీమాబాద్ వైపు వెళుతుండగా, పోలీసు వారు పాపయ్యపేట చమన్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నిందితుడు ఆటో దిగి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకోని నిందితున్ని అదుపులోకి తీసుకోవడం జరిగింది. నిందితుడు ఇంటిలో దాచిపెట్టిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితుడిని పట్టుకున్న విధానం..




### మావోయిస్టు పార్టీ సభ్యుల

## లొంగుబాటు



**ఏటూరునాగారం,మహా:** నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన 9 మంది సభ్యులు ఏటూరునాగారం ఓఎస్డీ గితే మహేష్ బాబాసాహెబ్ ఎదుట లొంగిపోయారు. ఛత్తీస్ ఘడ్ రాష్ట్రానికి చెందిన మడకం ఉంగ, మడకం ఇడిమి, పోడియం కోస, సోడి జోగి, కుంజం ఐతే, సోడి భుద్ర, కుంజం కోస, పోడియం ఐతే, కుంజం కోస వీరంతా ప్రశాంత జీవనం గడిపేందుకు లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, కమాండెంట్ సతీష్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు తాజుద్దీన్, టివిఆర్ సూరి లు ఉన్నారు.



# ఆరేండ్లలో రద్దీ రెట్టింపు

**హైదరాబాద్:** హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో రాబోయే ఆరేండ్లలో ప్రయాణీకుల రద్దీ దాదాపు రెట్టింపు కానుందని జీఎమ్మార్ గ్రూప్ అంచనా వేస్తున్నది. ఇక్కడి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని (ఆర్‌జీఐఏ) జీఎమ్మార్ గ్రూప్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్‌ఐఏఎల్) సీఈవో ప్రదీప్ ఫణికర్ పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 203031నాటికి హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ప్యాసింజర్ ట్రాఫిక్ ఏటా 50 మిలియన్ల (5 కోట్లు)కు చేరవచ్చన్నారు.
ప్రస్తుతం 29 మిలియన్లు (2.9 కోట్లు)గా ఉండొచ్చని చెప్పారు. 'దేశంలోని మెట్రో నగరాల్లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఎయిర్‌పోర్టుల్లో హైదరాబాద్ ముందున్నది. గత ఏడాది మార్చికల్లా విమానాశ్రయంలో ప్రయాణీకుల రద్దీ 2.5 కోట్లుగా ఉన్నది. ఈ ఏడాది మార్చి ఆఖరుకు 2.9 కోట్లుగా రికార్డు కాగలదు. 2031 మార్చి 31 నాటికి ఇది 5 కోట్లను తాకుతుందని నమ్ముతున్నాం.' అని ప్రదీప్ తెలియజేశారు. నిజానికి ఇప్పటికే ఏటా 4 కోట్ల ప్రయాణీకుల రద్దీని తట్టుకునేలా ఎయిర్‌పోర్టులో కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధిపర్చినట్టు చెప్పారు. 2008లో 1.2 కోట్ల ప్రయాణీకుల రద్దీ సామర్థ్యంతో ఈ ఎయిర్‌పోర్టును నిర్మించిన సంగతి విదితమే. కాగా, 2023తో పోల్చితే గత ఏడాది ఎయిర్‌పోర్టుకు 36 లక్షల ప్రయాణీకులు పెరిగారని ప్రదీప్ వివరించారు. ఢిల్లీలో మినహా దేశంలోని మరే ఇతర ఎయిర్‌పోర్టుల్లోనూ ఈ స్థాయి పెరుగుదల లేదని గుర్తుచేశారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రస్తుతమున్న కార్గో టెర్మినల్‌ను దాదాపు రూ.215 కోట్లతో విస్తరించే దిశగా వెళ్తున్నామని, రూ.155 కోట్లతో కొత్తగా మరో టెర్మినల్ నిర్మించబోతున్నామని మొత్తం రూ.370 కోట్ల పెట్టుబడి పెట్టనున్నామని ప్రదీప్ ఈ సందర్భంగా వెల్లడించారు. నూతన టెర్మినల్‌తో వార్షిక సామర్థ్యం 4 లక్షల టన్నులకు చేరగలదన్నారు.

# ఈ మార్కెట్లకు ఏమైంది

## కొనసాగుతున్న విదేశీ మదుపరుల పెట్టుబడుల ఉపసంహరణ

**ముంబై, ఫిబ్రవరి 22:** భారతీయ స్టాక్ మార్కెట్లు.. మదుపరులకు షాక్ మార్కెట్లుగా తయారవుతున్నాయి. ప్రధాన సూచీలు వరుస నష్టాల్లో కదలాడుతుండటంతో లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైపోతున్నది మరి. అటు బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్‌ఈ)లోని సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఈ)లోని నిఫ్టీ.. రెండింట్లోనూ నమోదైన కంపెనీల విలువ గతకొద్ది రోజులుగా దారుణంగా పడిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి.



### ఇదీ సంగతి..

దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలకు ముఖ్య కారణాల్లోకి వెళ్తే.. పలు దేశ, విదేశీ పరిణామాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే అంతకంతకూ పడిపోతున్న రూపాయి మారకం విలువ, పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతోపాటు ఇజ్రాయెల్-హమాస్ పరస్పర దాడులు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలతో ఏర్పడ్డ వాణిజ్య యుద్ధం భయాలు, నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్, ఆశించిన స్థాయిలో లేని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్ల తగ్గింపులు, పడిపోతున్న భారత జీడీపీ, విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం, పడకేసిన పారిశ్రామికోత్పత్తి వంటివి దేశీయ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులను పెద్ద ఎత్తున ప్రభావితం చేశాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటిదాకా సెన్సెక్స్ 2,827.95 పాయింట్లు, నిఫ్టీ 848.90 పాయింట్లు కోల్పోయాయి.

### అదానీ టాప్ లూజర్

ఈ ఏడాదిలో ఇప్పటిదాకా గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ సంస్థల స్టాక్స్ విలువ భారీగా పడిపోయింది. 11.9 బిలియన్ డాలర్లు (రూ.లక్ష కోట్లపైనే) హరించుకుపోయింది. ఆ తర్వాత ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విలువ 2.94 బిలియన్ డాలర్లు (రూ.25వేల కోట్లపైనే) క్షీణించింది. దిలీప్ సంఘ్వీ, శివ్‌నాడార్, రవీ జైపూరియా వంటి బడా కార్పొరేట్ కంపెనీల విలువ సైతం బాగానే పతనమైంది. అందరిదీ కలిపితే రూ.2.5 లక్షల కోట్లదాకా నష్టం ఉంటున్నది. మరోవైపు ఈ దెబ్బకు బ్లూంబర్గ్ బిలియనీర్ ఇండెక్స్‌లో ముకేశ్ అంబానీ స్థానం 17 (87.7 బిలియన్ డాలర్లు)కు, గౌతమ్ అదానీ ర్యాంక్ 23 (66.8 బిలియన్ డాలర్లు)కు దిగజారాయి. అయితే ఇప్పటికీ ఆసియా దేశాల్లోని సంపన్నుల్లో అగ్రస్థానంలో ముకేశ్, ఆ తర్వాత అదానీయే ఉన్నారు.

### ఎఫ్‌ఐఐలు దూరం

**విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్‌ఐఐ) భారతీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వీలైనంత ఎక్కువగా వెనక్కి తీసుకుంటూనే ఉన్నారు. జనవరిలో దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి ఏకంగా రూ.78,000 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకోవడం గమనార్హం. ఈ నెల్లోనూ రూ.40,436.17 కోట్లు తరలిపోయాయి. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.1,18,436.17 కోట్లు వెనక్కి పోయినట్టైంది. ఇక దేశీయంగా పెట్టుబడులు పెడుతున్న ఎఫ్‌ఐఐల్లో సుమారు 35 శాతం అమెరికాకు చెందినవారే. అగ్రరాజ్యాధినేత ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో వీరి పెట్టుబడుల ఉపసంహరణలు ఇటీవలికాలంలో పెరిగాయని చెప్పవచ్చు. నిజానికి గడిచిన పదేండ్లలో భారతీయ స్టాక్ మార్కెట్లలో ఎఫ్‌ఐఐ పెట్టుబడుల వాటా 4 శాతానికిపైగా క్షీణించింది. 2015 జనవరిలో 20.2 శాతంగా ఉంటే.. ఈ ఏడాది జనవరిలో 16 శాతంగా ఉన్నది. ఇది 12 ఏండ్ల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. గత ఏడాది అక్టోబర్ నుంచి ఎఫ్‌ఐఐలు తీవ్ర అమ్మకాల ఒత్తిడిలోనే ఉంటున్నారు. అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి దాదాపు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నారు.**

# తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు ఆహ్వానం

తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(టీజీబీసీఎల్) రాష్ట్రంలో కొత్త లిక్కర్ బ్రాండ్లను ఆహ్వానించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త కంపెనీల మద్యం బ్రాండ్లకు అనుమతులు ఇవ్వనున్నారు. తెలంగాణలో లేని విదేశీ, దేశీయ లిక్కర్, బీర్ కంపెనీలు తమ మద్యం బ్రాండ్లను అమ్మకాలు జరుపుకోవడానికి టీజీబీసీఎల్ దరఖాస్తులను ఆహ్వానించింది. టీజీబీసీఎల్ లో రిజిస్టర్ కానీ కొత్త కంపెనీలు ఇతర రాష్ట్రాల్లో నాణ్యత ప్రమాణాలతో మద్యం అమ్మకాలు చేస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మద్యం అమ్మకాలపై ఎలాంటి ఆరోపణలు లేవని నిర్ధారణ సర్టిఫికేట్ ను దరఖాస్తుతో జతపరచాలని టీజీబీసీఎల్ కోరింది. తెలంగాణలో పలు కొత్త కంపెనీలు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి టీజీబీసీఎల్ కొందరికి అనుమతులు ఇచ్చింది. కానీ కొత్త కంపెనీలపై పలు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన కొత్త బ్రాండ్లను నిలిపివేసిన విషయం తెలిసిందే.

### కొత్త మద్యం బ్రాండ్లకు ఆహ్వానం

తాజాగా తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్ల ఆహ్వానానికి కొత్త విధానానికి ప్రభుత్వం నాంది పలికింది. కొత్త దరఖాస్తులను ఆహ్వానించే ముందు బహిరంగ ప్రకటన ఇవ్వాలని ప్రభుత్వం టీజీబీసీఎల్ లకు నిర్దేశించింది. దీంతో టీజీబీసీఎల్ తెలంగాణలో రిజిస్టర్ కానీ కొత్త సప్లయర్స్ నుంచి దరఖాస్తులు తీసుకోవడానికి ప్రకటన జారీ చేసింది. కొత్త కంపెనీల నుంచి వచ్చిన దరఖాస్తులను పది రోజులపాటు ఆన్లైన్లో పెట్టాలని నిర్ణయం తీసుకుంది. దరఖాస్తులపై వచ్చిన అభ్యంతరాలపై విచారణ జరిపి అనుమతులపై నిర్ణయం తీసుకోనుంది. టీజీబీసీఎల్ లో రిజిస్టర్ అయ్యి సరఫరా చేస్తున్న సప్లయర్స్ మాత్రం ప్రస్తుతం ఉన్న పద్ధతిలోనే కొత్త బ్రాండ్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ కొత్త మద్యం బ్రాండ్లపై నిర్ణయం తీసుకోనున్నాకని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

### మూడ్రోజుల వైన్స్ బంద్

రాష్ట్రంలో మూడు రోజుల పాటు లిక్కర్ దుకాణాలు బంద్ కానున్నాయి. పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని సగానికిపైగా జిల్లాల్లో ఈ నిర్ణయం అమల్లో ఉండనుంది. హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో కూడా లిక్కర్ షాపులు క్లోజ్ కానున్నాయి. రాష్ట్రంలోని ఉమ్మడి మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అంతేకాకుండా ఉమ్మడి ఖమ్మం-వరంగల్- నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి కూడా ఎలక్షన్ జరగనుంది. దాదాపు ఎన్నికల ప్రచారం కూడా పూర్తి కావొచ్చింది. ఫిబ్రవరి 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది.





## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# మహిళను వేధించిన వ్యక్తి..
## పొడిచి చంపిన ఆమె తల్లిదండ్రులు

**ముంబై:** ఒక వ్యక్తి మహిళను వేధించాడు. ఆగ్రహించిన ఆమె తల్లిదండ్రులు, బంధువులు అతడ్ని కొట్టారు. అంతటితో ఆగక కత్తితో పొడిచి ఆ వ్యక్తిని హత్య చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు మహిళ కుటుంబానికి చెందిన పది మందిని అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 21న హడ్గావ్ ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల షేక్ అరాఫత్ స్థానికంగా ఉన్న ఒక మహిళను వేధించాడు. కాగా, మహిళను ఆ వ్యక్తి పలుమార్లు వేధించినట్లు తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు, బంధువులు ఈ సంఘటనపై ఆగ్రహించారు. అరాఫత్ ఇంటికి వారు చేరుకున్నారు. అతడ్ని కొట్టారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన అరాఫత్ తల్లిని కూడా కొట్టారు. కత్తితో అరాఫత్‌ను పొడిచి అతడ్ని హత్య చేశారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అరాఫత్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి హత్యకు సంబంధించి మహిళ తల్లిదండ్రులు, బంధువులతో సహా పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# కేజ్రీవాల్ సమక్షంలో.. ఆప్‌లో చేరిన పంజాబీ నటి సోనియా మాన్

**చండీగఢ్:** పంజాబీ నటి సోనియా మాన్ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో చేరింది. కీర్తి కిసాన్ యూనియన్ నేత బల్దేవ్ సింగ్ కుమార్తె అయిన ఆమె ఆదివారం ఆమ్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకుని సభ్యత్వం స్వీకరించింది. ఆప్ పంజాబ్ విభాగం ఈ విషయాన్ని ఎక్స్‌లో పేర్కొంది. 'కీర్తి కిసాన్ యూనియన్ నాయకుడు ఎస్ బల్దేవ్ సింగ్ కుమార్తె, పంజాబీ నటి సోనియా మాన్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలో ఆప్‌లో చేరారు. ఆమ్ ఆద్మీ పార్టీ కుటుంబంలోకి ఆమెకు స్వాగతం' అని పోస్ట్ చేసింది. కాగా, పంజాబీతోపాటు, హిందీ, మరాఠీ, మలయాళం, తెలుగుతో సహా పలు భాషా చిత్రాల్లో సోనియా మాన్ నటించింది. ఆమె తొలి చిత్రం 'హైడ్ అండ్ సీక్'. 2014లో 'కహైన్ హై మేరా ప్యార్' సినిమాతో హిందీలో తెరంగ్రేటం చేసింది. 2020లో హ్యాపీ హార్డీ, హీర్ చిత్రాల్లో నటించింది. మరోవైపు 2018లో హత్యకు గురైన పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలాతో సహా ప్రసిద్ధ సింగర్స్‌తో కలిసి సోనియా మాన్ పని చేసింది. కిసాన్ యూనియన్ నేత అయిన ఆమె తండ్రి బల్దేవ్ సింగ్‌ను 1980లో ఖలిస్తానీ ఉగ్రవాదులు కాల్చి చంపారు.





# కుంభమేళాకు భార్యను తీసుకెళ్లి..
# హత్య చేసిన భర్త

**న్యూఢిల్లీ:** ఒక వ్యక్తి తన భార్యను కుంభమేళాకు తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను హత్య చేశాడు. కుంభమేళాలో భార్య తప్పిపోయినట్లు తన పిల్లలకు చెప్పాడు. మహిళ హత్య గురించి తెలుసుకున్న యూపీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చివరకు నిందితుడైన ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని త్రిలోక్‌పురికి చెందిన అశోక్ కుమార్ తన భార్య మీనాక్షితో కలిసి కుంభమేళాకు వెళ్లాడు. ఫిబ్రవరి 18న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయోగ్‌రాజ్‌కు వారు చేరుకున్నారు. కుంభమేళాలో స్నానంతోపాటు ఇతర ఫొటోలు, వీడియోలను తన పిల్లలకు అశోక్ కుమార్ పంపాడు. తమ టూర్ సంతోషంగా సాగుతున్నట్లు వారికి చెప్పాడు. ఒక సత్రంలో వారు బస చేశారు. అయితే ఆ రాత్రి అక్కడి బాత్ రూమ్‌లో భార్యను కత్తితో పొడిచి హత్య చేశాడు. ఢిల్లీ చేరుకున్న అతడు కుంభమేళాలో భార్య తప్పిపోయినట్లు తన పిల్లలకు చెప్పాడు. కాగా, ఫిబ్రవరి 18న బాత్‌రూమ్‌లో మహిళ మృతదేహాన్ని ఆ సత్రం మేనేజర్ గుర్తించాడు. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ మహిళ కనిపించడం లేదంటూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. ఇది తెలుసుకున్న మీనాక్షి సోదరుడు తన కుమారులతో కలిసి ప్రయాగ్‌రాజ్ చేరుకున్నాడు. సోదరి మృతదేహాన్ని గుర్తించాడు. దీంతో ఆమె భర్త అశోక్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

మరోవైపు తండ్రి మాటలు నమ్మని పిల్లలు తమ తల్లి కోసం ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. ఆమె ఫొటోను చేతపట్టుకుని అక్కడ వెతికారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తమ తల్లిని తండ్రి హత్య చేసినట్లు తెలుసుకుని షాక్ అయ్యారు. చివరకు నిందితుడైన అశోక్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక మహిళతో వివాహేతర సంబంధం ఉన్న అతడు భార్య అడ్డుతొలగించుకునేందుకు కుంభమేళాకు తీసుకువచ్చి హత్య చేశాడని పోలీస్ అధికారి వెల్లడించారు.

# ఇస్రో పనితీరు గర్వకారణం
## మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ISRO) 100వ రాకెట్ ప్రయోగం పూర్తి చేయడం గర్వకారణంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ (Narendra Modi) అన్నారు. అంతరిక్ష రంగం (Space Sector) లో దేశం ఏటా పురోగతి సాధిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ఇస్రోకు ప్రధాని అభినందనలు తెలియజేశారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా మాట్లాడిన ప్రధాని.. ఇస్రో, ఏఐ రంగాలపై ప్రధానంగా చర్చించారు. గతంతో పోలిస్తే ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల సంఖ్య పెరగడం అభినందనీయమని ప్రధాని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత్ మరింత ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కైలాష్‌ను మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. గిరిజన భాషలను పరిరక్షించడంలో ఆయన సాయం చేశారంటూ కొనియాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి కొలామి భాషలో కైలాష్ పాటను కంపోజ్ చేశారని ప్రధాని మోదీ అన్నారు.

# ఓ పన్నీర్‌సెల్వంకు
# అన్నాడీఎంకేలో స్థానం లేదు
## కే పళనిస్వామి



**చెన్నై:** బహిష్కరించిన ఓ పన్నీర్‌సెల్వం (ఓపీఎస్)కు పార్టీలో ఎలాంటి స్థానం లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కే పళనిస్వామి (K Palaniswami) అన్నారు. పార్టీలోకి ఆయనను తిరిగి తీసుకునే అవకాశం లేదని తెలిపారు. ఓపీఎస్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై పళనిస్వామి స్పందించారు. సోమవారం దివంగత సీఎం జయలలిత 77వ జయంతి. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే కార్యకర్తలకు ఆదివారం ఆయన లేఖ రాశారు. 'తోడేలు, గొర్రెలు కలిసి జీవించగలవా? కలుపు మొక్కలు, మొక్కలు పంటలో భాగం కాగలవా? విశ్వాసపాత్రుడు, ద్రోహి భుజం భుజం కలిపి నిలబడగలరా? మీ దృఢమైన సమాధానం నాకు వినిపిస్తోంది' అని అందులో పేర్కొన్నారు. కాగా, అన్నాడీఎంకేలోకి తిరిగి రావడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు మాజీ సీఎం పన్నీర్‌సెల్వం ఇటీవల తెలిపారు. అయితే పార్టీలో సర్వశక్తిమంతుడైన ప్రధాన కార్యదర్శి పదవిని కార్యకర్తలే ఎన్నుకోవాలని పట్టుబట్టారు. 'నేను, టీటీవీ దినకరన్, శశికళ (అన్నాడీఎంకే నుంచి బహిష్కృతులు) ఎలాంటి షరతులు లేకుండా అన్నాడీఎంకేతో ఏకం కావడానికి సిద్ధంగా ఉన్నాం. చర్చల ద్వారా సమస్యలను మేం పరిష్కరించుకోవచ్చు' అని అన్నారు. అన్నాడీఎంకే కార్మికుల హక్కుల పునరుద్ధరణ కమిటీకి పన్నీర్‌సెల్వం నాయకత్వం వహిస్తున్నారు.




# ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా మజాకా ట్రైలర్


రిజల్ట్‌తో సంబంధం లేకుండా థియేటర్‌కు వచ్చే ఆడియెన్స్‌కు కొత్త కథను చూపించాలని తహతహలాడే హీరోల్లో సందీప్ కిషన్ ఒకరు. అసలు.. ఈయన ఫిల్మోగ్రఫీలో చాలా డిఫరెంట్ సినిమాలుంటాయి. నిజానికి.. సందీప్ కిషన్ ఫ్లాప్ సినిమాలు కూడా ఒకసారి హ్యాపీగా చూసేయొచ్చు అనేలా ఉంటాయి. ప్రతీ సినిమా సబ్జెక్ట్‌కు వేరియేషన్స్ చూపిస్తుంటాడు. కమర్షియల్‌గా ఆహా ఓహో అనే రేంజ్‌లో బ్లాక్ బస్టర్‌లు కొట్టకపోవచ్చు కానీ.. సందీప్ సినిమాలు రిలీజవుతున్నాయంటే మాత్రం పాజిటీవ్ బజ్ ఉంటుంది.ఇక చాలా కాలంగా సందీప్ సాలిడ్ హిట్టు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. మధ్యలో ఊరిపేరు భైరవకోన అంటూ డిఫరెంట్ అటెంప్ట్‌తో వచ్చాడు. మరీ బ్లాక్ బస్టర్ హిట్టవలేదు కానీ.. సూపర్ హిట్టుగా నిలిచింది. నిజానికి సెకండ్ ఆఫ్‌లో కొన్ని చేంజెస్ చేస్తుంటే.. మరో విరూపాక్ష రేంజ్ బొమ్మ అయ్యుండేదని చాలా మంది అభిప్రాయపడ్డారు. ఇక ప్రస్తుతం సందీప్ కిషన్ చేతిలో రెండు, మూడు ప్రాజెక్ట్‌లున్నాయి. అందులో మజాకా ఒకటి.

# బిజినెస్ రంగంలోకి ముమైత్ ఖాన్

ముమైత్ ఖాన్.. ఈ పేరు గురించి తెలుగు రాష్ట్రాల ప్రజలకు పెద్దగా పరిచయం అక్కర్లేదు. ఐటెం సాంగ్‌లతో మొదలు పెట్టి.. హీరోయిన్‌గా, లేడీ ఓరియెంటెడ్ సినిమాలు సైతం చేసి తెలుగులో తిరుగులేని పాపులారిటీ సంపాదించుకుంది. మైసమ్మ ఐపీఎస్ సినిమా ముమైత్‌కు మంచి క్రేజ్ తెచ్చిపెట్టింది. ఇక ఎవడైతే నాకేంటి, ఆపరేషన్ దుర్యోధన వంటి సినిమాల్లో కీలక పాత్రలతో మెప్పించింది. చివరగా ఈ బ్యూటీ ఆర్‌డిఎక్స్ లవ్ సినిమాలో నటించింది. ఇక ఇదిలా ఉంటే తాజాగా ముమైత్ బిజినెస్ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. బ్యూటీ ఎడ్యుకేషన్ మరియు ట్రైనింగ్ లో కొత్త శకానికి నాంది పలుకుతూ యూసుఫ్‌గూడ లోని వీలైక్ మేకప్ అండ్ హెయిర్ అకాడమీ బ్రైడల్, మేకప్, హెయిర్ స్టైలింగ్, కాస్మోటాలజీ, స్కిన్‌కేర్ మరియు వెల్‌నెస్‌లో నైపుణ్యం పైన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమం లో వీలైక్‌అకాడమీ డైరెక్టర్ ముమైత్ ఖాన్ తో పాటు కో ఫౌండర్స్ కెయిత్, జావేద్, ఆర్టిస్టులు జ్యోతి, అక్స ఖాన్, సింగర్ రోల్ రైడా, డ్యాన్స్ మాస్టర్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



# మెగాస్టారా మజాకా



పంచభూతాలను ఏకం చేసే ఓ కాలచక్రాన్ని పోస్టర్‌లో చూపిస్తూ ప్రీ లుక్ తోనే సినిమాపై తిరుగులేని క్యూరియాసిటీ క్రియేట్ చేశారు మేకర్స్. ఆ తర్వాత రిలీజైన టీజర్ ఒక్కసారిగా అంచనాలను జై అని లేపింది. 'విశ్వంభర'.. ఖైదీ నెంబర్ 150 తర్వాత, మళ్లీ మెగాస్టార్ సినిమాపై తిరుగులేని అంచనాలు నెలకొన్నాయంటే అది ఈ సినిమాపైనే. మల్లిడి వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఆడియెన్స్ లో మాములు ఎక్స్‌పెక్టేషన్స్ లేవు. దాదాపు రెండొందల కోట్ల బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఫాంటసీ సినిమాగా రూపొందుతుంది.

## క్రీడా వార్తలు SPORTS NEWS



# భారత్ చేతిలో పాక్ చిత్తు
## విరాట్ వీరవిహారం

- ఛాంపియన్స్ ట్రోఫీలో రెండో విజయం
- వన్డేల్లో కోహ్లీ ఆల్‌టైమ్ రికార్డ్
- సెమీస్ కు భారత్.. టోర్నీ నుండి పాక్ ఔట్

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఈ మెగా టోర్నీలో భాగంగా దుబాయ్ వేదికగా దాయాది పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో టీమిండియా విజయభేరి మోగించింది. ఈ గెలుపుతో భారత్ తమ సెమీస్ బెర్త్‌ను ఖారారు దాదాపు ఖారారు చేసుకున్నట్లే. పాకిస్తాన్ నిర్దేశించిన 242 పరుగుల టార్గెట్‌ను భారత్ కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 42.3 ఓవర్లలో ఊదిపడేసింది.

### విరాట్ సూపర్ సెంచరీ..

భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లి సూపర్ సెంచరీతో మెరిశాడు. రోహిత్ శర్మ ఔటయ్యక క్రీజులోకి విరాట్.. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. తొలుత శుబ్‌మన్ గిల్‌తో కలిసి విలువైన పార్టనర్‌షిప్ నెలకొల్పిన కోహ్లి.. ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్‌తో కలిసి మ్యాచ్ విన్నింగ్ భాగస్వామ్యం నమోదు చేశాడు. ఈ క్రమంలో 111 బంతుల్లో తన 51వ వన్డే సెంచరీ మార్క్‌ను కింగ్ కోహ్లి అందుకున్నాడు. కోహ్లి 111 బంతుల్లో 7 ఫోర్లతో సరిగ్గా 100 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. కోహ్లికి ఇది 82వ అంతర్జాతీయ సెంచరీ కావడం విశేషం. ఇక కోహ్లితో పాటు శ్రేయస్ అయ్యర్(67 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 56), శుబ్‌మన్ గిల్(46) పరుగులతో రాణించారు. పాక్ బౌలర్లలో షాహీన్ అఫ్రిది రెండు వికెట్లు పడగొట్టగా.. ఆర్బర్ ఆహ్మద్, కుష్దిల్ షా తలా రెండు వికెట్లు వికెట్ సాధించారు.

### చెలరేగిన భారత బౌలర్లు..

అంతకముందు బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ పాకిస్తాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. పాక్ బ్యాటర్లలో సౌద్ షకీల్(62) టాప్ స్కోరర్‌గా నిలవగా.. కెప్టెన్ రిజ్వాన్(46), ఖుష్దిల్ షా(38) మెరుగ్గా ఆడారు. ఇక భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ మూడు, హార్దిక్ పాండ్యా రెండు వికెట్లు తీయగా.. అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఒక్కో వికెట్ తీశారు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌లో మార్చి 2న న్యూజిలాండ్‌తో తలపడనుంది.

# అన్ స్టాపబుల్.. క్రికెట్ కింగ్
## విరాట్.. రికార్డులన్నీ ఫటాఫట్

- చిరుతపులిలా పరుగులు
- వన్డేల్లో కోహ్లీ ఆల్ టైమ్ రికార్డు



(మహా ప్రత్యేకం)

కింగ్ కోహ్లీ. మ్యాచ్ ను గెలిపించడమే కాకుండా రికార్డుల రారాజుగా నిలిచిపోయాడు. అభిమానులంతా తనను ఎందుకు కింగ్ అంటారో.. పాకిస్థాన్ ను ఛాంపియన్స్ ట్రోఫీలో చిత్తుచేసి మరీ నిరూపించాడు. చిరుత పులిలా పరుగులు తీసి రికార్డుల దాహం తీర్చుకున్నాడు. తన సెంచరీతో పాకిస్థాన్ ను ఛాంపియన్స్ ట్రోఫీ నుండి తరిమికొట్టడమే కాకుండా.. స్టార్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించారు. వన్డేల్లో అత్యంత వేగంగా 14 వేల పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పారు. ఛాంపియన్స్ ట్రోఫిలో భాగంగా భారత్‌పాకిస్థాన్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో కోహ్లీ 15 పరుగులు వద్ద ఈ మైలురాయిని దాటాడు. సచిన్, సంగక్కరల రికార్డులను సైతం బ్రేక్ చేశాడు. సచిన్ టెండుల్కర్ 350 ఇన్నింగ్స్‌లో 14 వేల పరుగులు చేశాడు. కానీ విరాట్ కోహ్లీ 287 ఇన్నింగ్స్‌లోనే 14 వేల పరుగులు దాటాడు. ఇప్పటివరకు వన్డేల్లో ఇద్దరు క్రికెటర్లు మాత్రమే 14 వేల కన్నా ఎక్కువ పరుగులు చేశారు. తాజాగా కోహ్లీ మూడో స్థానంలోకి చేరుకున్నాడు. ఇందులో సచిన్ టెండుల్కర్ 18,426 పరుగులు, కుమార సంగక్కర 14,234 పరుగులు, విరాట్ కోహ్లీ (భారత్) 14,002 పరుగులు చేసినవాళ్లుగా ఉన్నారు.

### కింగ్ ముందు.. రికార్డులు బలాదూర్

భారత్ ఆటగాళ్ళలో అత్యధిక వన్డే సెంచరీలు చేసిన వారిలో కోహ్లీ ముందున్నాడు. ఇందులో సచిన్ ను దాటేసి ముందుకు వెళ్ళిపోయాడు విరాట్. సచిన్ తన మొత్తం కెరీర్ లో 49 సెంచరీలు చేయగా...కింగ్ కోహ్లీ మాత్రం ఇప్పటికే 51 సెంచరీలు చేసి భారత బ్యాటర్లలో అత్యధిక సెంచరీల వీరుడిగా నిలిచాడు. ఇంకా కొన్నాళ్ళు ఆడతాడు కాబట్టి మరిన్ని సెంచరీలు చేస్తాడు. అలా అయితే విరాట్ ను చేరుకోవడం ఎవరి వల్లా కాదని క్రికెట్ పండితులు చెబుతున్నారు. యంగ్ క్రికెటర్లు ఎంతో కష్టపడితే కానీ కింగ్ కోహ్లీని చేరుకోవడమే కష్టం అని అంటున్నారు. కోహ్లీ ఈ మ్యాచ్ తో మరో ఘనత కూడా తన కీర్తి కిరీటంలో పెట్టుకున్నాడు. విరాట్ కోహ్లీ టీమిండియా తరఫున అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఫీల్డర్‌గా నిలిచాడు. ఇంతకు ముందు ఉన్న మహ్మద్ అజారుద్దీన్ రికార్డును విరాట్ బ్రేక్ చేశాడు. విరాట్ కోహ్లీ 158 క్యాచ్‌లతో మొదటి స్థానంలో ఉన్నారు. రెండో స్థానంలో మహ్మద్ అజారుద్దీన్156 , మూడో స్థానంలో సచిన్ టెండుల్కర్140 ఉన్నారు. ఈ రికార్డులు సాధించడమే కాకుండా భారత్ తాజా విజయంతో 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో పాక్‌పై ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకున్నట్లయింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com